Crime Mirror
QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
THE
Voice of Anti Corruption

హైదరాబాద్
22-11-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 12

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# అదానీపై అమెరికా అరెస్ట్ వారెంట్

## మోసం, లంచం ఆరోపణలపై కేసు నమోదు

## మేనల్లుడు సాగర్‌తోపాటు మరో ఆరుగురికి కూడా..



- సోలార్ ప్రాజెక్టుల కోసం అధికారులకు లంచాలు
- 2,238 కోట్ల లంచం కోసం రుణాలకు యత్నం
- మాయమాటలతో బ్యాంకులు, ఇన్వెస్టర్లకు బురిడీ
- ఎఫ్‌సీపీఏ పరిధిలోకి కేసు.. అగ్రరాజ్యం ఎంట్రీ
- నేరం రుజువైతే ఐదేండ్ల జైలు, భారీ జరిమానా?!
- అమెరికాలో కేసుతో అదానీకి కెన్యా భారీ షాక్
- ఎయిర్‌పోర్ట్, విద్యుత్తు లైన్ల కాంట్రాక్టులు రద్దు

2లో

**ఆదానీ గ్రూపు మరో వివాదంలో ఇరుక్కుంది. అదికూడా లంచం కేసు కావడం విశేషం. భారత బిలియనీర్, అదానీ గ్రూప్ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీపై లంచం కేసు నమోదయ్యింది. ఈ మేరకు అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడమే గాక.. దాని గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి వారి నుంచి నిధుల సేకరణకు పాల్పడినట్లు న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.**

**న్యూయార్క్,(క్రైమ్ మిర్రర్):** ఆదానీ గ్రూపు మరో వివాదంలో ఇరుక్కుంది. అదికూడా లంచం కేసు కావడం విశేషం. భారత బిలియనీర్, అదానీ గ్రూప్ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీపై లంచం కేసు నమోదయ్యింది. ఈ మేరకు అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడమే గాక.. దాని గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి వారి నుంచి నిధుల సేకరణకు పాల్పడినట్లు న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. దీంతో గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



## మూసీ పునరుజ్జీవం నుంచి వెనక్కి తగ్గం

### ఎన్ని శక్తులు అడ్డుపడినా పూర్తి చేస్తాం

### హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకు వెళతాం

### ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన సిఎం రేవంత్

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని, ఎన్ని శక్తులు అడ్డుపడినా పక్రియ పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.‘నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి..నదులను కబళిస్తే..

- మిగతా 2వ పేజీలో

## సనాతన ధర్మం సమున్నతం

- గాలి, నేల, నీరు, నింగి, నిప్పులోనూ దేవుడిని చూస్తాం
- ప్రకృతికి దండం పెట్టే పవిత్రమైన హిందూ ధర్మం మనది
- ఆ సంస్కృతిని కాపాడుకోవాలి: వెంకయ్య నాయుడు
- అట్టహాసంగా లోక్‌మంథన్-2024 ఎగ్జిబిషన్ ప్రారంభం
- రాజకీయాలకు అతీతంగా ఉత్సవాలు.: కిషన్‌రెడ్డి



మిగతా 2లో

## 25 నుంచి పార్లమెంట్

16 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం





## రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

### గుంట భూమిని కబ్జా చేసినట్లు రుజువు చేయగలవా

### కబ్జాల చరిత్ర మీదే అంటూ హరీష్ రావు ఘాటు విమర్శలు

**సంగారెడ్డి,(క్రైమ్ మిర్రర్):** బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డితెరలేపుతున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని సీఎం చేసిన తప్పుడు ఆరోపణలపై ఘాటుగా స్పందించారు.గురువారం అందోల్ మండలం మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు.

మిగతా 2లో



## ప్రజాస్వామ్యం మానవత్వం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- స్వార్థం, విస్తరణవాదాన్ని భారత్ నమ్ముకోలేదని వెల్లడి
- గయానా ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ప్రసంగం

జార్జిటౌన్: ప్రపంచ శాంతి, సౌభాగ్యాలే లక్ష్యంగా ‘ప్రజాస్వామ్యం ప్రథమం, మానవత్వం ప్రథమం’ అనే సరికొత్త పిలుపును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చారు. అంతరిక్షం, సముద్రం అనేవి అంతర్జాతీయంగా పరస్పర సహకారానికి, అభివృద్ధికి వేదికలు కావాలి తప్ప సంఘర్షణలు, యుద్ధాలకు కాదని తేల్చిచెప్పారు.

మిగతా 2లో

## విదేశీ విద్యకు సాయమందించండి

- డిప్యూటీ సీఎంకు పలువురు తల్లిదండ్రుల విజ్ఞప్తి
- వీలున్నంత త్వరగా నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చిన భట్టి
- జూనియర్ లెక్చరర్ల పోస్టింగులు ఇప్పించాలని అభ్యర్థన
- మంత్రితో ముఖాముఖిలో 300 దరఖాస్తులు




## కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు గ్రీన్ సిగ్నల్

### బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం ఆమోదం

అమరావతి: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం ఆమోదం పొందింది.

మిగతా 2లో

# రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని నాపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేశాడు.పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర నీదని ధ్వజమెత్తారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా13 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదని స్పష్టం చేశారు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే ఉన్నాను.నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు రేవంత్ రెడ్డి.. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం. నువ్వు ఎన్ని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రైతుల పక్షాన నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగాడా అని ప్రశ్నించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో సైతం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మరోపక్క సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రకటించారు. దీని ఆంతర్యమేమిటని నిలదీశారు. మధ్యలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడికి పోయిందో చెప్పాలన్నారు. రైతులు పండించిన



ధాన్యంలో సగం దళారుల పాలయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..దళిత, గిరిజన, అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతున్నది. కంపెనీ నిర్మాణాల కోసం ఆ భూములను తన ఆప్తులకు కట్టబెట్టే ప్రయత్నం సీఎం చేస్తున్నాడు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

## అదానీపై అమెరికా అరెస్ట్ వారెంట్

అదానీ, దాని అనుబంధ సంస్థలు 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభం పొందగల సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 265 మిలియన్ డాలర్లు లంచాలు ఆఫర్ చేసినట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అనంతరం అమెరికా, అంతర్జాతీయ మదుపర్లకు తప్పుడు సమాచారం తెలియజేసి నిధులు సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించినట్లు పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా.. ఆ కంపెనీ రుణ దాతలు, పెట్టుబడిదారుల నుంచి 3 బిలియన్ డాలర్లకు పైగా రుణాలు, బాండ్లను సేకరించిందని ఆరోపిస్తూ న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు. ఇదే సమయంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకు పైగా సమీకరించిందని అందులో ఆరోపించింది. దీనిపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది. అయితే తమపై వచ్చిన ఆరోపణలపై అదానీ గ్రూప్ స్పందించింది. సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి లంచం ఇవ్వజూపారంటూ వచ్చిన అభియోగాలను తోసిపుచ్చింది. అదానీ గ్రూపుపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కొట్టి పారేసింది. చట్టాలకు లోబడి తమ గ్రూపు నడుచుకుంటోందని వివరణ ఇచ్చింది. న్యాయపరంగా ముందుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నా మని పేర్కొంది. సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడంలో భాగంగా అదానీ గ్రూపు రూ.2,100 కోట్లు భారత అధికారులకు లంచం ఇవ్వజూపిందన్న ఆరోపణలతో పాటు, దాని గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. గౌతమ్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదైనట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అదానీ గ్రూపు స్టాక్స్ భారీగా పడ్డాయి. ఈ వ్యవహారం రాజకీయంగానూ దుమారం రేపింది. దీంతో కాంగ్రెస్, భాజపాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. అదానీ గ్రూపుపై పెద్దఎత్తున ఆరోపణలు రావడంపై ఆ గ్రూపు స్పందించింది. అవి కేవలం నేరారోపణలు మాత్రమేనని అదానీ గ్రూపు ప్రతినిధి పేర్కొన్నారు. దోషులుగా రుజువయ్యే వరకు నిందితులను నిర్దోషులుగానే భావించాల్సి ఉంటుందన్నారు. పాలనా వ్యవహారాల్లో, పారదర్శకత విషయంలో అదానీ గ్రూపు ఎప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటిస్తుందన్నారు. తాము కార్యకలాపాలు నిర్వహించే ప్రతిచోటా వీటిని పాటిస్తూ వస్తున్నామన్నారు. చట్టాలను గౌరవిస్తూ, వాటికి లోబడి నడుచుకుంటున్నందున వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదానీ గ్రూపు ఓ ప్రకటనలో పేర్కొంది.

## 25 నుంచి పార్లమెంట్

న్యూఢిల్లీ: ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు అదానీ అవినీతి అంశంపై వేడెక్కనున్నాయి. ఈ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లు సహా మొత్తం 16 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఆగస్టులో సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును ఉభయ సభల జాయింట్ కమిటీ అధ్యయనం కోసం పంపారు. శీతాకాల సమావేశం ప్రారంభమైన తొలివారం ఆఖరిరోజు ఈ నివేదిక సమర్పించాలని గతంలోనే నిర్ణయించారు. దీంతో వారు నివేదిక ఇచ్చిన అనంతరం బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో జమిలి ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రివర్గం ఇదివరకే ఆమోదం తెలిపింది. అయితే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే కొత్త బిల్లుల జాబితాలో ఇది లేకపోయినప్పటికీ ఈ సమావేశంలోనే దీనిని కూడా ప్రవేశపెడతారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఐదు కొత్త బిల్లులలో కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ద ఇండియన్ పోర్ట్స్ బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కో-ఆపరేటివ్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్రీయ సహకార విశ్వవిద్యాలయ బిల్లు, పంజాబ్ కోర్ట్స్ (సవరణ) బిల్లు ఉన్నాయి.

## కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యం మానవత్వం హైకోర్టు, కేంద్రానికి పంపుతామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ ఆమోదించిందని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. హైకోర్ట్ బెంచ్ ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన అనంతరం చంద్రబాబు మాట్లాడారు. 'లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కార్యాలయాల తరలింపు ఉండదు, అవి కర్నూలులోనే ఉంటాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఉత్తరాంధ్రలో విశాఖ, సీమలో కర్నూలు, తిరుపతి పట్టణాలను మరింత అభివృద్ధి చేస్తాం. మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం మూడు ముక్కలాటలాడి ఏ ప్రాంతం అభివృద్ధి కాకుండా చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మేము విశాఖ, కర్నూలులో కూడా అమరావతే రాజధాని అని ఆ ప్రాంత ప్రజలను ఒప్పించాం. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం. గతంలో చేశాం... మళ్లీ చేసి చూపిస్తాం. రాయాలసీమగా ఎడారిగా మారుతుందని ఆలోచించి కృష్ణా జలాలను సీమకు తరలించాలని ఆలోచించింది ఎన్టీఆర్. ఇందులో భాగంగానే తెలుగుగంగ, హంద్రీనీవా, నగరి గాలేరు ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించారు. వాటిని పూర్తి చేసేది కూడా ఎన్డీయేనే.నదుల అనుసంధానం చేసి, పోలవరం పూర్తి చేసి గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళ్తే గేమ్ ఛేంజర్ అవుతుంది. కియా పరిశ్రమను తీసుకొచ్చేందుకు యేడాదిలోనే గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేశాం. కియా రాకతో అనంత జిల్లా ముఖచిత్రం మారిపోయింది. హార్టికల్చర్ అభివృద్ధి చేస్తే మహర్దశ వస్తుంది. అనంతపురానికి బెంగళూరు ఎయిర్ పోర్టు, కర్నూలుకు హైదరాబాద్ ఎయిర్ పోర్టు, చిత్తూరుకు చెన్నై ఎయిర్ పోర్టులు దగ్గరగా ఉన్నాయి...ఈ మూడు అవకాశాలను అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు. సీమలోనూ మంచి రోడ్లు వచ్చాయంటే టీడీపీ హయాంలోనే. ఓర్వకల్లులో ఎయిర్ పోర్టు పెట్టాం. తిరుపతి ఎయిరో పోర్టును విస్తరించి సర్వీసులు పెంచేలా చేశాం. కడప ఎయిర్ పోర్టులో రాత్రి సమయంలోనూ విమానాలు దిగే అవకాశం కల్పించాం. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో నాలుగు ఎయిర్ పోర్టులు ఉన్నాయి. రాయలసీమలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. తిరుపతిని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చుతున్నాం.

## సనాతన ధర్మం సమున్నతం



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: భారతీయ సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైనదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. రాతిలోనూ ప్రాణిలోనూ.. అలాగే గాలి, నీరు, నింగి, నేల, నిప్పులోనూ భగవంతుడిని చూస్తామని.. ఆ సంస్కృతిని మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. "చీమకు చక్కెరపెట్టి, పాముకు పాలు పోసి, చెట్టుకు పసుపుపెట్టి, ప్రకృతికి దండం పెట్టే పవిత్రమైన జాతి మనది.. హిందూ ?ధర్మం మనది. దురదృష్టవశాత్తు పాశ్చాత్య వ్యామోహం వైపు వెళుతున్నాం" అని విచారం వ్యక్తం చేశారు. ఇంగ్లిషు వాళ్లు దండయాత్ర చేసి.. బంగారం, వజ్రవైఢుర్యాల రూపంలో ఆర్థికంగా మనల్ని దోచుకెళ్లడమే కాకుండా మన మనసులనూ దోచుకెళ్లారని.. ఆ కారణంగా మన సాహిత్యం, సంగీతం, వాయిద్యం, భాష, సంస్కృతులను మరిచిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో మళ్లీ భారతీయ మూలాలకు మనం వెళ్లాలి అని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటుచేసిన లోక్‌మంథన్-2024లో భాగంగా గిరిజన సంప్రదాయ వాయిద్యాల ఎగ్జిబిషన్‌ను వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకయ్య మాట్లాడారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతిని పరిరక్షించుకోవాలన్నారు. ఒకప్పుడు సంగీతం, సాహిత్యం, వాయిద్యం ఉండేవని.. ఇప్పుడవి పోయి.. జింగిరి బింగిరి సాహిత్యం, సంగీతంతో పాటలు వస్తున్నాయని... మన సంస్కృతిని, భాషను మరచిపోవడమే దీనికి కారణమని వివరించారు. ఇంగ్లిషుపై వ్యామోహం పనికిరాదన్నారు. తొలి ప్రాధాన్యం మాతృభాషకు ఇవ్వాలని.. అమ్మభాష కంటిచూపు అయితే ఇంగ్లిషు కళ్లజోడులాంటిదన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మాతృభాషలోనే చదువుకున్నారని, ఉపరాష్ట్రపతిగా పనిచేసిన తానూ వీధిబడిలో తెలుగులోనే చదువుకున్నానని చెప్పారు. శక్తి సామర్థ్యాలు, నీతి, నిజాయితీ, వ్యక్తిత్వం ఉండాలిగానీ, పాశ్యాత్య వ్యామోహం కాదని హితవు పలికారు. తాను ఉపరాష్ట్రపతి అయ్యాక వేష?ధారణ (డ్రెస్) మార్చుకుంటారా? అని నన్ను అడిగితే, అది మార్చుకునే ప్రసక్తేలేదని, అడ్రస్ మాత్రమే మారిందని చెప్పినట్లు గుర్తుచేశారు. కుటుంబ వ్యవస్థ, పెళ్లిళ్లు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ కుటుంబ వ్యవస్థను పటిష్టపరచాలని పిలుపునిచ్చారు.



## విదేశీ విద్యకు సాయమందించండి

హైదరాబాద్: తమ పిల్లలు చదువుకునేందుకు విదేశాలకు వెళ్లారని, వారికి అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం కింద సాయమందించాలని పలువురు తల్లిదండ్రులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన మల్లు భట్టి విక్రమార్కను సామాన్య ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. విదేశీ విద్యానిధి పథకం కింద పెద్ద చదువులు చదువుకునే విద్యార్థులకు ప్రజాప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పిన భట్టి.. వీలున్నంత త్వరగా ఆ నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ' తన తల్లి బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతున్నారని, ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకునేందుకు అవసరమైన సాయం అందించాలని ముహేుశ్ కోరగా, భట్టి వెంటనే స్పందించి ఇప్పటివరకు అయిన ఆస్పత్రి బిల్లులకు ఎల్‌ఓసీ ఇప్పించాయిలని తన పీఏను ఆదేశించారు. స్వయంగా తున నంబరు ఆ యువకుడికి ఇచ్చి ఎలాంటి సుముస్య ఉన్నా తనకు తెలియజేయాలని సూచించారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించి ఫలితాలు వచ్చిన తర్వాత కూడా తమకు పోస్టింగులు ఇవ్వలేదంటూ పెద్ద ఎత్తున నిరుద్యోగులు భట్టికి విజ్ఞప్తి చేయగా, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ' ట్రాన్స్‌కో, జెన్‌కోలలో ఖాళీగా ఉన్న డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, ఇంజనీర్ పోస్టులను వెంటనే భర్తీ చేయ' ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల కోసం పలువురు విజ్ఞప్తి చేశారు.

## ప్రజాస్వామ్యం మానవత్వం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం గయానా దేశ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. స్వార్థం, విస్తరణవాదం అనే సంకుచిత ధోరణిని భారత్ ఏనాడూ నమ్ముకోలేదని అన్నారు. విస్తరణవాదంతో ముందుకెళ్లాలన్న ఉద్దేశం తమకు లేదన్నారు. వనరుల దోపిడీ అనే ఆలోచనకు భారత్ దూరంగా ఉంటుందని వివరించారు. మూడు దేశాల పర్యటన భాగంగా ప్రధాని మోదీ గయానాలో పర్యటించారు. గయానా పార్లమెంట్‌లో ఆయన ఇంకా ఏం చెప్పారంటే... "ప్రపంచం ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే 'ప్రజాస్వామ్యం ప్రథమం, మానవత్వం ప్రథమం' అనే సూత్రాన్ని అనుసరించాలి. అదే మనకు తారకమంత్రం. మనతోపాటు అందరినీ కలుపుకొని వెళ్లాలని, అందరి అభివృద్ధిలో మనం సైతం భాగస్వాములం కావాలని ప్రజాస్వామ్యం ప్రథమం స్ఫూర్తి బోధిస్తోంది. మనం నిర్ణయాలు తీసుకోవడంలో మానవత్వం ప్రథమం అనే ఉద్దేశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మానవత్వానికి తొలి ప్రాధాన్యం ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటే వచ్చే ఫలితాలతో మొత్తం మానవాళికి మేలు జరుగుతుంది. గ్లోబల్ సౌత్ దేశాలు మేల్కోవాల్సిన సమయం వచ్చింది. మనమంతా క్రియాశీలకంగా పనిచేయాలి. మనం ఒక్కతాటిపైకి రావాలి. మనం కలిసికట్టుగా పని చేస్తూ నూతన ప్రపంచ క్రమాన్ని(గ్లోబల్ ఆర్డర్) సృష్టించాలి. ప్రపంచం విషయానికొస్తే యుద్ధాలు, ఘర్షణలకు ఇది సమయం కాదు. యుద్ధాలకు దారితీస్తున్న పరిస్థితులను గుర్తించి, వాటిని రూపుమాపాల్సిన సమయం ఇది. భారత్%-%గయానా మధ్య గత 150 ఏళ్లుగా స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయి.

భారత్ దృష్టిలో ప్రతి దేశమూ కీలకమైనదే. ఏ ఒక్కటీ తక్కువ కాదు. ద్వీప దేశాలను చిన్న దేశాలుగా పరిగణించడం లేదు. వాటిని అతిపెద్ద సముద్ర దేశాలుగా భావిస్తున్నాం. 'ప్రజాస్వామ్యం ప్రథమం, మానవత్వం ప్రథమం' అనే స్ఫూర్తితో భారత్ 'విశ్వబంధు'గా తన బాధ్యతను నిర్వర్తిస్తోంది. ప్రపంచంలో ఎక్కడైనా సంక్షోభాలు తలెత్తితే అందరికంటే మొదట భారత్ స్పందిస్తోంది' అని ప్రధాని మోదీ వివరించారు.

## మూసీ పునరుజ్జీవం నుంచి వెనక్కి తగ్గం

మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజా ఆరోగ్యం పటిష్ఠ ఆర్థికం పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ, శాపంగా మిగిలిపోకూడదు. మూసీ ప్రక్షాళన చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం. ఈ తరానికే కాదు.. తరతరాలకు మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం రేవంత్ ఓ పోస్ట్ చేశారు. కాగా.. మూసీ పరీవాహక ప్రాంతం మురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో యాదవులకు అత్యధికంగా సీట్లు ఇస్తామని, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పెంచి నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు.

# పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది

## పోలీసులు తాగుడుకు దూరంగా ఉండండి

**లంచాలకు మరిగితే అంతే సంగతులు**

**ఎప్పుడూ ఫిట్‌గా ఉండేలా చూసుకోవాలి**

**పోలీసులకు కీలక సూచనలు చేసిన కమిషనర్ సివి ఆనంద్**

**పోలీసులు తాగుడుకు దూరంగా ఉండాలని సీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. యువ పోలీసులు ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉండాలని.. దేనికి ఏ వ్యసనానికి కూడా లొంగకూడదని.. బానిస కాకూడదని తెలిపారు. 'నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్‌లో 75 కేజీల మధ్యలో ఉన్నాను. నేను చాలా ఫిట్‌గా ఉన్నాను.**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): పోలీసులు తాగుడుకు దూరంగా ఉండాలని సీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. యువ పోలీసులు ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉండాలని.. దేనికి ఏ వ్యసనానికి కూడా లొంగకూడదని.. బానిస కాకూడదని తెలిపారు. 'నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్‌లో 75 కేజీల మధ్యలో ఉన్నాను. నేను చాలా ఫిట్‌గా ఉన్నాను. 30 ఏళ్ల క్రితం నా ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో వేసుకున్న పోలీస్ డ్రెస్ ఇప్పుడు కూడా వేసుకోగలను. మీరు శిక్షణ పొందిన పేట్లబురుజు ఆర్మ్ రిజర్వ్ ఇన్చార్జ్ డీసీపీ దక్షిణామూర్తిని చూడండి ఎంత ఫిట్‌గా ఉన్నారో. ఫిట్‌గా ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోండి అని సూచించారు.. పోలీసుల జీతాల విషయంలో ప్రభుత్వం ఎక్కువగా పెంచదు. పోలీసులు అవినీతికి పాల్పడకూడదు. ఐపీఎస్ లాంటి ఉద్యోగంలో కూడా జీతాలు అంతంత మాత్రమే. పోలీస్ శాఖలో మెల్లమెల్లగా జీతాలు పెరుగుతూనే ఉంటాయి. పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది. ఒక పరిస్థితిలో నేను కూడా రాజీనామా చేసి వెళ్ళలనుకున్నా. శిక్షణ తీసుకున్నవారు మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి' అంటూ సీపీ ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8,047 మంది పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ పొందారని.. ఇందులో 4,100 సివిల్, 3,685 మంది ఏఆర్ 2,028 కమ్యూనికేషన్స్, 18 మంది పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఉన్నారని సీపీ ఆనంద్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో నుంచి హైదరాబాద్ పోలీస్ శాఖకు 1,128 మందిని ట్రైనింగ్ కోసం కేటాయించినట్లు చెప్పారు. ఇప్పుడు 747 మంది దీక్షత్ పాసింగ్ అవుట్ పరేడ్ చేశారన్నారు. 3,081 మంది మహిళల కానిస్టేబుల్స్ పోలీస్ శిక్షణ పొందారన్నారు. 1992లో తాను ఐపీఎస్ శిక్షణ పొందాను పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. అప్పుడు 80 మంది ట్రైనీ ఐపీఎస్‌లు పాల్గొన్నాం. వర్షం పడుతున్నా పరేడ్ పూర్తి చేశాం' అంటూ ఆనాటి విషయాలను గుర్తుచేశారు సీపీ. శిక్షణ పొంది పోలీస్ శాఖలో 35 ఏళ్లు గడపబోతున్నారని... శిక్షణ పొందిన వారు అకుంటిత దీక్షతో పని చేయాలని సూచించారు. పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలన్నారు. పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడడంలో కర్తవ్యం నెరవేర్చాలని స్పష్టం చేశారు. పోలీస్ డ్యూటీ అంటే ఒత్తిడితో కూడుకున్నదని ఆయన తెలిపారు.

అలాగే పోలీసులకు సీపీ ముఖ్య సూచన చేశారు. కాగా.. తెలంగాణా పోలీస్ అకాడమిలో కానిస్టేబుల్స్ నాలుగవ పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ జితేందర్, పోలీసులు ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఆర్, సివిల్, ఎస్ఏఆర్‌సీపీఎల్, ఐటీ, సీఏఎన్‌పీటీఓ విభాగాలకు చెందిన 8,047 మంది స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ విజయవంతమైంది. ఫిబ్రవరి21, 2024లో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ మొదలైంది. రాష్ట్రంలో మొత్తం 19 ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ జరిగింది. కానిస్టేబుల్ శిక్షణ పొందిన వారిలో 5709 పురుషులు, 2338 మహిళ అభ్యర్థులు ఉన్నారు. ట్రైనీ కానిస్టేబుల్స్‌కు సమగ్రంగా అన్ని అంశాలపై శిక్షణ పూర్తి అయ్యింది. సివిల్, క్రిమినల్, సైబర్ కేసులు, ఎన్‌డీపీఎస్ యాక్ట్, క్రైమ్, సెల్ఫ్ డిఫెన్స్ ఇలా చాలా అంశాలపై ట్రైనింగ్ జరిగింది. కానిస్టేబుల్స్‌లో గ్రాడ్యుయేషన్ 5470 , పోస్ట్ గ్రాడ్యుయేషన్ 1361 చదివిన వారు ఉన్నారు. ఇందులో టెక్నికల్1755, నాన్ టెక్నికల్ 5505, లా పూర్తి చేసుకున్న వారు 15 మంది ఉన్నారు. నేడు పాసింగ్ ఔట్ పరేడ్ తరువాత తెలంగాణ పౌరుల సేవలో 8,047 మంది కానిస్టేబుల్స్ పాల్గొననున్నారు.

# నటుడు నాగార్జునపై వ్యాఖ్యల కేసు

### కౌంటర్ దాఖలుచేసిన మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): సినీనటుడు నాగార్జున వేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి కోర్టులో వాదనలు జరిగాయి. మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నాగార్జున దావా వేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన కౌంటర్‌ను కొండా సురేఖ తరపు న్యాయవాది గురుప్రీత్ సింగ్ దాఖలు చేశారు. నాగార్జున తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు. ఇప్పటికే నాగార్జున, ఆయన కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. వాదనల సందర్భంగా నాగార్జున తరపు న్యాయవాది అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునపై కొండా సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. ఆ తర్వాత 'ఎక్స్'లో క్షమాపణ కోరుతూ పోస్ట్ పెట్టారన్నారు. ఎక్స్‌లో మంత్రి కొండా సురేఖ పెట్టిన పోస్టును ఆయన కోర్టు ముందు చదివి వినిపించారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అశోక్‌రెడ్డి అన్నారు. కచ్చితంగా కొండా సురేఖ క్రిమినల్ చర్యలకు అర్హురాలు అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వల్ల నాగార్జున కుటుంబం మానసికంగా ఎంతో కుంగిపోయిందని చెప్పారు.తాజాగా ఈ పిటిషన్ కి మంత్రి కొండా సురేఖ కౌంటర్ వేసింది. కౌంటర్ ఇస్తూ కొండా మంత్రి సురేఖ నాంపల్లి స్పెషల్ కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. దీంతో ఈరోజు కోర్టు ఆమె లాయర్ గురుమిత్ సింగ్ వాదనలు విననున్నారు. ఈ వ్యాజ్యంపై కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది. గాంధీ జయంతి సందర్భంగా బాపు ఘాట్‌లో నివాళులు అర్పించి కొండా సురేఖ మీడియాతో కేటీఆర్ గురించి ప్రస్తావిస్తూ.. 'ఎన్ కన్వెన్షన్ హాల్ కూల్చకుండా ఉండాలంటే సమంత నా దగ్గరకు రావాలని కేటీఆర్ కండిషన్ పెట్టాడు. నాగార్జున, నాగ చైతన్య మాట్లాడి సమంతను కేటీఆర్ దగ్గరికి వెళ్లాలని ఒత్తిడి చేశారు. కేటీఆర్ దగ్గరికి వెళ్ళడానికి సమంత ఒప్పుకోలేదు. కేటీఆర్ దగ్గరకి వెళ్ళకపోతే మా ఇంట్లో ఉంటే ఉండు.. లేకపోతే వెళ్ళిపో అన్నారు. అది భరించలేకనే సమంత విడాకులు తీసుకుంది' అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

# ఆడబిడ్డకో న్యాయం.. ఆదానీకో న్యాయమా

### మోడీని విమర్శిస్తూ...ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): అదానీ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్ చేశారు. బీజేపీ, ప్రధాని మోదీపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. జైలు నుంచి విడుదల అయ్యాక తొలిసారి కవిత రాజకీయ వ్యాఖ్యలు చేశారు. ఎన్నిసార్లు ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా..? అని కవిత ప్రశ్నించారు.అఖండ భారతంలో అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా అని ప్రశ్నించారు. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ. ఆధారాలు ఉన్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా అని కవిత ప్రధానిని ప్రశ్నించారు. ఎన్ని సార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా అని సూటిగా ప్రశ్నించారు కవిత.

# తెలంగాణ ఉద్యమంలో దీక్షా దివస్ కీలకం

### 29న రాష్ట్రవ్యాప్తంగా దీక్షాదివస్ నిర్వహణ

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిర్ వెల్లడి



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్ష దివాస్ నిలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్ష దివాస్‌ను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో జరిగే దీక్షా దివాస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొననున్నారు. 2009, నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలి దశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదలు వేసిందని కేటీఆర్ తెలిపారు. దీక్షకు వెళ్లే ముందు తెలంగాణ వచ్చుడో ? కేసీఆర్ సచ్చుడో అనే తెగింపుతో చేపట్టిన ఈ దీక్ష సబ్బండవర్ణాల తెలంగాణ ప్రజలను ఏకం చేసిందని పేర్కొన్నారు. ఈ దీక్ష యావత్ భారత దేశ రాజకీయ వ్యవస్థను కదిలించి, చరిత్రలో తొలిసారి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసి దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# అద్దె బకాయిలు చెల్లించని మాజీ ఎమ్మెల్యే

### నోటీసులు ఇచ్చిన స్పందించని ఆశన్నగారి జీవన్ రెడ్డి

### మరోమారు బకాయిల కోసం ఫైనాన్స్ కంపెనీ నోటీసులు



నిజామాబాద్, (క్రైమ్ మిర్రర్): బీఆర్ఎస్‌కు చెందిన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మాల్‌కి ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులుమరోమారు షాక్ ఇచ్చారు. జీవన్‌రెడ్డి మాల్‌కు మరోసారి ఫైనాన్స్ కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. ఆర్మూర్ ఆర్టీసీ డిపో స్థలంలో నిర్మించిన వ్యాపార సముదాయం.. బకాయిలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. రూ.45.46 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలంటూ నోటీసులో పేర్కొంది. గతంలో జీవన్‌రెడ్డికి ఆర్టీసీ, విద్యుత్ అధికారులు షాక్ ఇచ్చారు. ఆర్మూర్‌లోని ఆర్టీసీ స్థలాన్ని అద్దెకు తీసుకుని ఆ స్థలంలో షాపింగ్ మాల్‌ని జీవన్‌రెడ్డి నిర్మించాడు. అయితే షాపింగ్ మాల్ అద్దెని గత కొంత కాలంగా కట్టకుండా ఎగ్గొడుతున్నాడు. సుమారుగా రూ.7.50 కోట్ల బకాయిలు చెల్లించకుండా ఆర్టీసీ అధికారులను బెదిరిస్తూ వస్తున్నాడు. అలాగే తన షాపింగ్ మాల్‌కి విద్యుత్ బిల్లులు కూడా చెల్లించడం లేదు. ఇన్నిరోజులుగా అధికార బలంతో జీవన్‌రెడ్డి బకాయిలు అడగడానికి వచ్చిన అధికారులపై చెలరేగిపోయాడు. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో ఆర్టీసీ , విద్యుత్ అధికారులు రంగంలోకి దిగి జీవన్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగి షాపింగ్ మాల్‌కి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. షాపింగ్ మాల్‌కి బకాయి ఉన్న నగదును వెంటనే చెల్లించాలని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఆర్టీసీ, విద్యుత్ అధికారులు హెచ్చరించారు.బకాయిలు చెల్లించని నేపథ్యంలో ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌ను ఆర్టీసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మాల్‌కు గతంలో అధికారులు నోటీసులు అతికించి.. తాళం వేశారు. ఒప్పందం ప్రకారం విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ బాధ్యులు అ÷–దదె చెల్లించకపోవడంతో హైకోర్టు ఆదేశాల మేరకు జీవన్‌రెడ్డి మాల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్టు మైక్‌లో ప్రకటించారు. మాల్‌లో ఉన్న షాపుల యజమానులు సహకరించాలని కోరారు. 2013 జూన్1న బీఆర్ఎస్ ప్రభుత్వం.. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ బస్టాండ్ సమీపంలో 7,059 చదరపు గజాల భూమిని విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ కింద 33 ఏళ్లకు లీజుకు ఇచ్చింది. అయితే, 2017లో ఆ స్థలాన్ని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి టేకోవర్ చేసుకొని జీవన్‌రెడ్డి మాల్, మల్టీప్లెక్స్‌ను నిర్మించారు.




# ఎన్నికల హామీలను విస్మరించిన రేవంత్

### లగచర్ల ఘటనపై సిపిఎం విమర్శలు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ పునరుద్ధరించడమే నా 7వ గ్యారంటీ అని రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు చెప్పాడు. నేడు అధికారం చేపట్టాక మాట మార్చాడని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం తమ్మినేని ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా లగచర్లలో వామపక్ష నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అధికారం చేపట్టాక ప్రగతి భవన్ ముందున్న గేట్లు కూల్చి వేశాడు. అదొక్కటి తప్పా ఆయన చేసే పనులన్నీ అప్రజాస్వామ్యకంగానే నడుస్తున్నాయన్నారు. హైడ్రా కూల్చి వేతలు, మూసీ పరీవాహక ప్రాంతం, గ్రూప్ వన్ ఎగ్జామ్, దామగుండం ఇలా ప్రతి పనిని ఏకపక్షంగా చేశారని మండిపడ్డారు. లగుచర్లలో ఫార్మా సిటీ పేరుతో గిరిజనుల భూములు లాక్కోవడం అన్యాయమన్నారు. గతంలోనే ఫార్మా సిటీ కోసం 13 వేల ఎకరాలు సేకరించారు. దానిపై రేవంత్ రెడ్డి వైఖరేంటో చెప్పాలన్నారు. ఇప్పుడు మళ్లీ లగుచర్లలో 13 వందల ఎకరాలు సేకరించాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి పాలన అప్రజాస్వామికంగా కొనసాగుతుందని విమర్శించారు.

# డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు

### పలు బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం కసరత్తు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వం వెల్లడించింది సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ సర్కారు సన్నద్ధం చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టాన్ని ఆమోదించాలని చూస్తోంది. రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది.డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకోనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిసింది. అయితే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వినిపిస్తోంది. కానీ ఆలోపే మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు జరుగుతోందని కూడా సమాచారం అందుతోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పెన్షన్, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని పెంచేందుకు రేవంత్ సర్కారు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎలక్షన్స్‌కు ముందు పెన్షన్, రైతు భరోసాను పెంచితే ప్రభుత్వానికి మంచి పేరుతో పాటు పార్టీకి మైలేజీ వస్తుందని భావిస్తున్నారట.

## ఎడిటోరియల్



# వ్యవసాయాభివృద్ధికి చేయూత

## మంత్రి పొంగులేటి వెల్లడి

**వ్య**వసాయం బాగుంటేనే అన్ని బాగుంటాయని, రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఇంకా బాగుంటుందని రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతు రుణమాఫీ మొదలు ఉచిత కరెంట్ ధాన్యం సేకరణ వంటి విషయాల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ధాన్యం సేకరణ, సంచులు, సకాలంలో చెల్లింపులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతుల నుంచి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, అప్పటి వరకూ కేంద్రాలు ఉంటాయని స్పష్టం చేశారు.తెలంగాణలో పంటలు అద్భుతంగా పండుతున్నాయని అన్నారు. ఎక్కడిక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, అవసరమైతే సంచులను తెప్పిస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాజీలేదని గుర్తుచేశారు. అన్నదాతల సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు రైతులందరూ అండగా ఉండాలని కోరారు. ఇకపోతే మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వారి సంక్షేమం కోసం రొయ్య పిల్లలు, చేప పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసిన విత్తనాలతో మత్స్యకారులు లబ్ది పొందుతున్నారని అన్నారు. ఈ రొయ్య పిల్లలు, చేప పిల్లలను పెంచుకొని వాటి వేట ఆధారంగా ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఇదిలావుంటే ఉమ్మడి జిల్లాలో ఈసారి విస్తారంగా పత్తి సాగైంది. ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తున్నది. నాలుగేళ్ల నుంచి రైతులు పత్తి సాగు విస్తీర్ణాన్ని పెంచుతూ వస్తున్నారు. గిట్టుబాటు ధరలు ఏటా పెరుగుతుండడంతో రైతులు ఈ పంటపై ఆసక్తి కనబరస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవడం, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో సాగుకు ఢోకా లేకుండాపోయింది. పత్తి సాగుకు తక్కువ పెట్టుబడులు అవుతుండడంతో రైతులూ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. పత్తి తీత పనులు ప్రారంభం కావడంతో కూలీలకే కాదు ఆటోలు, ట్రాలీ యజమానులకూ గిరాకీ పెరిగింది. కూలీలు తీసిన పత్తిని రైతులు మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆరు నెలల పాటు ఆటో, ట్రాలీ యజమానులకు డిమాండ్ ఉంటుంది. సబ్‌యార్డులు ఉన్న దూరాన్ని బట్టి ట్రాలీ యజమానులు చార్జీలు వసూలు చేస్తున్నారు. కూలీలకు ఉపాధి లభిస్తున్నది. గతేడాది కంటే ఈ సారి ధరలు తక్కువగా ఉన్నాయి. సుజాతనగర్, జూలూరుపాడు మార్కెట్లకు భారీగా పత్తి బస్తాలు తరలివస్తున్నాయి. క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మిల్లుల్లో యాజమాన్యాలు పత్తి ఆరబెట్టుకునేందుకు వీలుగా షెడ్లు ఏర్పాటు చేశారు. రైతుల కోసం తాగునీటి వసతి కల్పించారు. మద్దతు ధరకు మించి ట్రేడర్స్ ధరలు పెంచుతుండ డంతో రైతులు సబ్‌మార్కెట్లలో పంటను విక్రయిస్తున్నారు. నాలుగు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులు బయట మార్కెట్‌కే మొగ్గు చూపుతున్నారు.రైతులు కూలీలకు కిలోల చొప్పున లెక్కగట్టి కూలి చెల్లిస్తున్నారు. ఒక్కో కూలీ రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు సంపాదిస్తున్నారు. సబ్‌యార్డుల్లో పత్తి లోడింగ్ చేసే కూలీలు రోజుకు రూ.వెయ్యి వరకు కూలి పొందుతున్నారు. ఒక్కో సబ్‌యార్డులో వందలాది మంది పనిచేస్తున్నారు.

## ఆక్వా ఎగముతలపై అంతర్జాతీయ ప్రభావం

### ధరలు తగ్గడంతో నష్టాల్లో రైతులు

ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న రంగం ఆక్వాదే. అయితే దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా మొదటి నుంచి రైతులే కష్టనష్టాలను ఎదుర్కొని సాగు చేస్తున్నారు. ఆక్వారంగం అభివృద్ధికి ప్రభుత్వం నామమాత్రం గానే చర్యలు తీసుకుంటుంది. మూడేళ్లుగా రొయ్యల మేత ధరలు పెరుగుతున్న తీరుపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తులు సాధిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా నాయకులకు మాత్రం పట్టడం లేదు. వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వసతుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక నష్టాలపాలవుతున్నారు. ప్రస్తుతం ఆక్వా రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు కొనుగోళ్లు బాగా తగ్గించడం వల్ల మార్కెట్లో రొయ్య ధర దారుణంగా పతనమైంది. విదేశాల నుంచి ఆర్డర్లు లేక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు, కోల్డ్ స్టోరేజీలు రొయ్యల నిల్వలతో నిండిపోయాయి. రొయ్యల సాగు ఖర్చు బాగా పెరిగిపోయింది. రూ.లక్షల నష్టాలతో రొయ్య రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. జనవరి వరకు ఆగి ఫిబ్రవరి నుంచి పండుగప్ప సాగు చేయాలనే ఆలోచనలో కొంతమంది రైతులున్నారు. ఉమ్మడి జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.2 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వార్షిక ఉత్పత్తి నాలుగు లక్షల టన్నులు. వార్షిక ఆదాయం రూ.18 వేల కోట్లు. 24 శీతల గిడ్డంగులు ఉన్నాయి.



# ధాన్యం సేకరణలో ఏటా దగా !

**ఏ**టా ధాన్యం అమ్మకాల్లో రైతులు నానా యాతన పడుతున్నారు. మద్దతు ధరలను మిల్లర్లు మింగేస్తున్నారు. దళారులు దగా చేస్తున్నారు. మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. దీంతో అన్నదాతలు అష్టకష్టాలు పడి పండించిన పంటలను అమ్ముకోవడంలో నానా కష్టాలు పడుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఏ ప్రభుత్వం వచ్చినా హడావిడి చేస్తోందే తప్ప రైతులకు అండగా నిలబడి ధాన్యం కొనేలా చేయలేకపోతోంది. కేంద్రం ఏనాడు కూడా సక్రమంగా ధాన్యం కొనేగోళ్లకు సంబంధించిన విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఇకపోతే అన్నదాతల అవసరాలు, అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అందినకాడికి దండుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా అధికారులకు ముందే తెలిసినా.. ముందుచూపు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పంట వేసిన తర్వాత సుమారు 3, 4 నెలల పాటు సమయం ఉంటుంది. కాని ఏటా పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ముందుచూపుతో పంట చేతికొచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినా.. ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతులు అంటున్నారు. దీనిని పాలకులు చోద్యంగా చూస్తున్నారు. పాలకులు తమ రాజకీయ విన్యాసాలకు ప్రజలను ఎలా మోసం చేస్తారో స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణలో జిల్లాకో ఇద్దరు ముగ్గురు మంత్రులు ఉన్నా ఇదే దుస్థితి నెలకొంది. ఎపిలోనూ ధాన్యం మద్దతు ధరల కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. తేమ ఉందనో తాలు ఉందనో ఇబ్బందులు పెడుతున్నారు. దడవాయి లాంటి పద్ధతి ఇక మరింత కృంగదీస్తోంది.ఇలా ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎప్పుడూ అన్యాయమే జరుగు తోంది. ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంటలు చేతికి వచ్చినా సజావుగా కొనుగోళ్లు జరుగుతాయన్న భరోసా లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరపాలని అప్పుడే అక్కడక్కడా ఆందోళనలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీలు సక్రమంగా వ్యవహరిస్తే ఇలాంటి పరిస్థితి రాదు. కానీ ధాన్యం కొనుగోళ్లపై మాటలే తప్ప స్పష్టత ఇవ్వడం లేదు. పైకి మాత్రం ఆదేశాలు వచ్చాయని హడావిడి చేస్తున్నారు. రాజకీయపార్టీల బలాబలాల ప్రదర్శనగా రైతుల సమస్యలు ఉన్నాయి. వారికి అండగా ఉంటామన్న మాటలే తప్ప చేతల్లో కానరావడం లేదు. ఇప్పుడు ధాన్యం సేకరణ విషయంలో రైతులకు మద్దతుగా బిఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. అయినా మార్పు లేదు. గతంలో జాతీయ ధాన్యం సేకరణ విధానం కోసం రైతులు చేసిన పోరాటం కేంద్రంపై రాజకీయ పోరాటంగానే బిజెపి భావించింది. అయినా ధాన్యం సేకరణలో ఓ జాతీయ విధానం అన్నది నేటికీ రూపుదాల్చలేదు. కనీసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అయినా ధాన్యం సేకరణపై స్పష్టమైన విధానాలు అవలంబించేలా చర్యలకు డిమాండ్ చేయాలి. ఒక్క ధాన్యం కొనుగేళ్లే కాదు.. అనేకానేక విషయాల్లో కేంద్రాన్ని నిలదీయాల్సిందే. దేశంలో ప్రధాని మోడీ విధానాల కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బతకడానికే కష్టపడుతున్నారు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా ప్రజలకు ఆహారభద్రత దక్కడంలేదు. దేశంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగుతున్నాయి. ఇటీవల బియ్యం ధరలు మళ్లీ పెరిగాయి. సన్నబియ్యం ధరలు ఏకంగా 68కి చేరువయ్యాయి. పెట్రో, డీజిల్, గ్యాస్ ధరలతో మొత్తంగా అన్ని సరకుల ధరలు పెరిగి సామాన్యులు నానాయాతనలు పడుతున్నారు.నిజానికి వ్యవసాయంపై జాతీయ విధానం రావాల్సిందే. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం రావాలి. వ్యాయసాయ దిగుమతులను తగ్గించుకుని..ఎగుమతులను పెంచుకోవాలి. వంటనూనెలను దిగుమతిని

ఆపేయాలి. దేశీయంగా నూనె గింజల ఉత్పత్తికి ప్రోత్సాహం ఇవ్వాల్సిందే. ఇవన్నీ చర్చించడానికి కేంద్రం పై అన్ని రాష్ట్రాలు కలసి ఒత్తిడి తేవాలి. జాతీయ పంటల విధానం కోసం పోరాడాలి. అన్ని రాష్ట్రాల్లో ఏకాభిప్రాయం రావాలి. కానీ అలా జగరడం లేదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటు న్నారే తప్ప ప్రజలను పట్టించు కోవడం లేదు. పంజాబ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన తరహాలోనే దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపింది. అయితే ఇందులో ఎవరిది తప్పు..ఎవరిది కరెక్ట్ అన్నది తేల్చాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ నేటిదాకా ఒకే విధానం అమల్లో ఉండడం వల్ల ధాన్యం సేకరణలో మార్పులు చోటు చేసుకోవడం లేదు. రాష్ట్రాలుతమ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నాయని కేంద్ర అధికారులు చెబుతున్నారు. జాతీయవిధానం కావాలంటే అందుకు ప్రత్యామ్నాయంగా ఆయా రాష్ట్రాలను కలుపుకుని పోరాడాలి. వరి కొనుగోళ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విమర్శల పర్వం ఇకముందు తగదు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన వైఖరి తీసుకొని.. రైతులకు భరోసా కల్పించాలి. అనేకచోట్ల మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలను కూడా సాగు చేస్తున్నారు. పలు జిల్లాల్లో భారీగా ఆరుతడి పంటలను ఎక్కువగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా జొన్న, మొక్క జొన్న, శనగ, పత్తి తదితర పంటలు సాగయ్యాయి. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, సరిపడా నీటితడులు అందడంతో దిగు బడులు ఆశాజనకంగానే కనిపిస్తు న్నాయి. ప్రతీసారి కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో సగంపంట దళారుల పాలవుతూనే ఉంది. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగం పంట అమ్మిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదు. . ఇప్పటికే పంట నూర్పిడి చేసిన రైతులు.. బయట మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి దిగుబడులను అమ్మేసుకుంటున్నారు. దళారులు ఇంటికే వచ్చి రైతులను మభ్యపెడుతూ తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చివరి నిముషంలో కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇకనైనా సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ధాన్యం సేకరణపై స్పష్టమైన విధానం అవలంబించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

(ఆధ్యాత్మిక చింతన)



## కార్తీకంలో నిత్య దీపోత్సవాలు

**వై**ష్ణవం, శైవం, శాక్తేయం తదితర సర్వ సంప్రదాయాలకు కార్తీకమాసం శ్రేష్టమైనది. ఈ మాసంలో దైవ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వందల రెట్లు అధికంగా ఫలితం కలుగుతుందని స్వామిజీలు ఉద్ఘాటించారు. ఏటా తిరుపతిలో అత్యంత వైభవంగా కార్తీక మహాదీపోత్సవం నిర్వహిస్తారు. ఈ యేడు కూడా భారీ సంఖ్యలో భక్తులు హాజరై సామూహిక దీపారాధన చేశారు. ఇక తిరుమలతో పాటు, పద్మావతి అమ్మవారి దేవాలయ ప్రాంగణాల్లో నిత్యం దీపోతసవం కన్నుల పండువుగా సాగుతోంది. దపాన్ని వెలిగిస్తే మనలోని అజ్ఞానం అనే అంధకారం తొలగి జ్ఞానం అనే వెలుగు ప్రకాశిస్తుం దంటారు. పవిత్రమైన కార్తీక మాసంలో దీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.శివ కేశవుల వైశిష్ట్యం, దీపం ప్రాముఖ్యత, దీపారాధన వల్ల అజ్ఞానమనే చీకటిని పారద్రోలి ప్రజల హృదయాల్లో ఆధ్యాత్మిక జ్ఞానదీపాలు వెలిగించాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఈ సందర్భంగా భక్తులు ప్రార్థిస్తున్నారు. దైవనామాన్ని జపిస్తే దీర్ఘాయువు కలుగుతుందంటారు. దీపోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీనివాసుని కటాక్షం కలగాలని కోరుకుంటారు. కార్తీక పౌర్ణమి రోజున భక్తులతో దీప మంత్రం మూడుసార్లు పలికిస్తూ సామూహిక లక్ష్మీ నీరాజనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులందరూ ఒక్కసారిగా చేసిన దీపారాధనతో తిరుపతి ప్రాంగణం వెలుగుతో నిండిపోయింది.

# భవిష్యత్ ఎజెండా సిపిఎస్ రద్దు




### ప్రధాన అంశంగా లెఫ్ట్ పార్టీల గుర్తింపు

**సి**పిఎస్ రద్దు ఇప్పుడు ఎన్నికల ఎజెండాగా మారింది. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు లెఫ్ట్ పార్టీలతో పాటు అన్ని వర్గాలు మద్దతుగా నిలుస్తున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో కూడా దీని ప్రభావం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగులు ఎవరివైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు అంశాన్ని ఎజెండా పైకి తెచ్చారు. ఇక్కడ బిజెపి ఓటమి పాలైతే సిపిఎస్ రద్దుకు సానుకూల పరిస్థితి ఏర్పడవచ్చు. ఇప్పుడు దేశంలో ఓపిఎస్ అమలవుతున్న రాష్ట్రాల సంఖ్య ఐదుకు చేరింది. జమిలి ఎన్నికలు వస్తే సిపిఎస్ సమస్యను ఎన్నికల ఎజెండాగా మార్చాల్సిన అవసరముంది. ఇక్కడ కూడా ప్రధానంగా ఓపిఎస్ అమలుకు మోకాలు అడ్డం పెడుతున్న పార్టీ బిజెపి. మిగతా పార్టీలపై ఒత్తిడి పెంచగలిగితే సిపిఎస్ రద్దుకు గట్టి హామీ పొందగల అవకాశం వుంది. జాతీయస్థాయిలో జమిలి ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నది. జాతీయ ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల్లో శాసనసభలకు ఒకేసారి ఎ÷-నికలు నిర్వహిస్తే సిపిఎస్ వేడి తగలక మానదు. ఎన్నికల్లో ఆశించిన విధంగా సిపిఎస్ రద్దుకు కట్టుబడిన ప్రభుత్వాలు వచ్చినట్లైతే, సిపిఎస్ రద్దు విషయాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విస్మరించలేని ఒక అనివార్య పరిస్థతి ఏర్పడుతుంది. సిపిఎస్ రద్దు కావాలంటే దేశంలో ఈ సానుకూల పరిస్థితులే సమకూరాలి. ప్రస్తుత మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో సీన్ రివర్స్ కాక తప్పదని లెఫ్ట్ పార్టీలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ అంచనాలు వాస్తవ రూపం దాల్చాలంటే, జమిలి ఎన్నికలకు ముందు ఆయా రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సిపిఎస్ వ్యతిరేక ఉద్యమం ఊపందుకోవాలి. అందు కోసం సదస్సులు, సెమినార్లు, ధర్నాలు, ఆందోళనలు అవిశ్రాంతంగా జరుగుతూనే వుండాలి. చిన్న చిన్న అవరోధాలకే ఆగిపోకూడదు. పాలక వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం ఎంతకైనా తెగిస్తాయి. సిపిఎస్ వ్యతిరేక ఉద్యమాన్ని జగన్ ప్రభుత్వం అణచివేసిన తీరు దీనికి ఉదాహరణ. కాబట్టి జావగారిపోవడం కాదు. తట్టుకొని నిలబడాలి. అందుకు ఐక్య కార్యాచరణ అత్యవసరం. ఉద్యోగులు వారి సంఘాల మధ్య పూర్తిస్థాయి ఐక్యత సాధించడంతో పాటు కార్మిక సంఘాల సహకారాన్ని కూడా తీసుకోవాలి. వాస్తవానికి సిపిఎస్ చట్టం కాకుండా 2004 నుండి దాదాపు దశాబ్ద కాలం పాటు పార్లమెంట్‌లో పోరాడింది వామపక్షం. కాబట్టి సిపిఎస్ వ్యతిరేక ఉద్యమానికి వామపక్ష పార్టీలు, వాటి ఆధ్వర్యంలోని ప్రజాసంఘాలు నిజమైన మిత్రులు. ఈ విధమైన విశాల మద్దతు కూడగట్టగలిగితేనే ఉద్యోగుల సిపిఎస్ రద్దు కల నెరవేరుతుంది. కాబట్టి ఉద్యోగులు, వారి సంఘాలు ఈ దిశగా ఆలోచించి ఆచరణకు పూనుకోవడం నేటి కర్తవ్యం. అందుకు సిపిఎం ఎప్పటికీ పోరాడుతుందని ఆ పార్టీ నేతలు హామీ ఇస్తున్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**



**హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్) :** జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ,జర్నలిస్టుల పక్షాన నిలిచిన ఏకైక జర్నలిస్టుల సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్)అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. ట్రేడ్ యూనియన్ గా కార్మిక శాఖలో నమోదై ప్రభుత్వ గుర్తింపు పొందిన టీడబ్ల్యూజేఎఫ్ లో సభ్యులుగా చేరే జర్నలిస్టులకు సంఘం అండగా ఉంటుందని అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ యూనియన్ లో చిన్న పెద్ద భేదం లేకుండా ప్రతి జర్నలిస్టుకు సభ్యత్వం, సమానత్వం కల్పించడం జరుగుతుందని, ప్రభుత్వం ద్వారా హెల్త్ కార్డులు, అర్హులైన వారికి అక్రెడిటేషన్ కార్డులు ఇప్పించేందుకు ఫెడరేషన్ కృషి చేస్తుందని చెప్పారు. ముఖ్యంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఫెడరేషన్ పోరాటం చేస్తుందని, జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాలలో ఇళ్ల స్థలాల సాధనకు పోరాటం చేయడానికి ఫెడరేషన్ సిద్ధమవుతుందని, గత ప్రభుత్వం హయాంలో జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగిందని, ఈ ప్రభుత్వంలో కూడా అలాగే జరిగితే పోరాటం చేయక తప్పదని అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు త్వరలో పూర్తి చేసి రాష్ట్ర మహాసభలు పెద్ద ఎత్తున జరిపేందుకు సన్నద్ధమవ్వాలని, అదేవిధంగా రాష్ట్ర కేంద్రంతో పాటు జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాలలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఫెడరేషన్ లో సభ్యత్వం తీసుకుని తమ హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఫెడరేషన్ బలంగా ఉందని, త్వరలో అన్ని నియోజకవర్గాల్లో మహాసభలు పూర్తి చేసి జిల్లా మహాసభను విజయవంతంగా జరపాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు పద్మారెడ్డి, జిల్లా కోశాధికారి బెలిదె అశోక్, కుత్బుల్లాపూర్ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## జుక్కల్ ఎమ్మెల్యేను అభినందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్:** హైదరాబాద్ లో గురువారం వ్యవసాయ,మార్కెటింగ్,కో ఆపరేటివ్ %d% చేనేత టెక్స్ టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావును,కిసాన్ జాతీయ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు %d% వ్యవసాయ,రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డిని మర్యాదపూర్వకంగా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక విధానాన్ని గురించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వివరించారు.దేశంలోనే ఏ రాజకీయ నాయకుడు చేయని సాహసం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచావని,ఈ విధానాన్ని రాజకీయ నాయకులు అందరూ అనుసరిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని,రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడం శుభపరిణామం అంటూ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును,మద్నూర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా ఎంపికైన సౌజన్య ని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు,కోదండ రెడ్డి అభినందించారు.



## శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం,లో హుండీ లెక్కింపు...

**చౌటుప్పల్ నవంబర్ 21(క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లాచౌటుప్పల్ మండల దండు మల్కాపురం లో శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం,హుండీ లెక్కింపు గురువారం రోజున లెక్కించగా 4 నెలల 20 రోజులకు గాను 14, 96,475 రూపాయలు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకులు కే ఏడుకొండలు,సల్వాది మోహన్ బాబు, కార్యనిర్వాణాధికారి ,సత్తిరెడ్డి జూనియర్ అసిస్టెంట్, అర్చకులు శివప్రసాద్ శర్మ, సేవా సమితి వారు , సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## రాజ్యాధికార రిజర్వేషన్ల కోసం ముదిరాజులను బీసీ డీ గ్రూపు నుండి బిసి ఏ గ్రూపులోనికి మార్చుటకు నా వంతుచేస్తాను...

**మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు**




**నవంబర్ 21(క్రైమ్ మిర్రర్):** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం భవనం వద్ద జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు ఆధ్వర్యంలో జెండా ఎగరవేయడం జరిగింది. తనంతరం సంజయ్ బాబు ముదిరాజ్ మాట్లాడుతూ వెనుకబడిన ముదిరాజ్ జాతిని ముందుకు నడిపించడం కోసం యువతరాన్ని అభ్యుదయ మార్గంలోనికి తీసుకురావడం కోసం నిరంతరం పాటుపడతానని మత్స్యకారుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా తోడ్పాటు అందించి విద్యా ఉద్యోగం మనకు రావలసిన న్యాయపరమైన హక్కుల కోసం రాజ్యాధికార రిజర్వేషన్ల కోసం ముదిరాజులను బీసీ డీ గ్రూపు నుండి బిసి ఏ గ్రూపులోనికి మార్చుటకు నా వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పాశం కృష్ణయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పాశం రఘుపతి ముదిరాజ్,మాజీ కార్యదర్శి పాశం శ్రీనివాస్ ముదిరాజ్, డైరెక్టర్లు పాశం లింగస్వామి ముదిరాజ్,పాశం యుగంధర్ ముదిరాజ్, పాశం శ్రీను ముదిరాజ్, పాశం జంగయ్య ముదిరాజ్, పాశం రాజు ముదిరాజ్, సభ్యులు పాశం అంజయ్యముదిరాజ్,పాశంమహేష్ ముదిరాజ్, పాశం వెంకటేశంముదిరాజ్, జనమోని శ్రీను ముదిరాజ్, మన్యం శంకర్ ముదిరాజ్,పాశం రాజేష్ ముదిరాజ్, పాశం నరసింహ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు..

## 71వ అఖిలభారత వారోత్సవాలు విజవంతం అయ్యాయి

**నిర్వాహకులు... డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్**



**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల జిల్లా 20 నవంబర్ న భీమారం మండలం కాజిపల్ల గ్రామంలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలు విజయవంతం ఐ నట్లు నిర్వాహకుడు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ తెలిపారు, ఆత్మీయ సమ్మేళనా నికి ముఖ్య అతిథులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తో పాటు. జిల్లా సహకార అధికారి బి సంజీవరెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఈర్ల శంకర్ తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ గౌరవ అధ్యక్షులు సందన వేణి మహేంద్ర నాథ్ యాదవ్ వన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి సమక్షం లో ఏడు రంగుల జెండా ఎగరవేసి రాష్ట్ర దుప్పట్లు చీరలు అవార్డ్స్ సర్టిఫికెట్లు సహకార సంఘాల బలోపేతం చేసిన సొసైటీ అధ్యక్షులకు అవార్డ్స్ ప్రశంస పత్రాలు మరియు బతుకమ్మ మహిళలకు చీరల పంపిణీ అవార్డ్స్ వృద్ధులకు బ్లాంకెట్స్ పంపిణీ చే య టం సంతోషాన్ని ఇచ్చిందని అన్నా రు,. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర సలహాదారు బేరి రామచందర్ యాదవ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్ నియోజకవర్గ అధ్యక్షులు సంధనివేని ప్రసాద్ యాదవ్ మాజీ సర్పంచ్ అక్కల మధుకర్ యాదవ్ నాయకులు కేవీ ప్రతాప్ చుంచు గురువయ్య సిగర్ జేయ కట్కూరి ప్రకాశ్ రెడ్డి మాజీ జెడ్పిటిసి భూక్య తిరుమల లక్ష్మణ్ పుష్క మల్ల పున్నం చెందు నాయకులు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మండే మల్లేష్ యాదవ్ మండల అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ గాదనవేణి మహేష్ యాదవ్ పల్లంలో సదానందం యాదవ్ గట్టు మహేష్ ఎలకపేట మహేష్ యాదవ్ డాక్టర్ ఎంకే రాజేష్ నరిగే బీరయ్య దయ్యాల రాజయ్య జంగపల్లి శ్రీధర్ కొమ్ము సురేందర్ సత్తన్న యాదవ్ మెసేజ్ ఎలకపేట మహేష్ యాదవ్ అంగ సంపత్ యాదవ్ చిర్రం పోచన్న కొమ్ము రాజశేఖర యాదవ్ అన్న మల్లేష్ కాట వేణి మహేష్ యాదవ్ ముదిగిరి కొమురయ్య గట్టన్న యాదవ్ మహిళల కు ధాన్య వాదాలు తెలిపారు

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం.



**కోదాడ:నవంబర్ 21(క్రైమ్ కౌంటర్):** కోదాడ మండలం గణపవరం గ్రామంలోని చిన్ననాటి స్నేహితుడు భూక్యా శ్రీను చనిపోవడంతో చిన్ననాటి స్నేహితులు అందరూ కలిసి వారి కుటుంబానికి 40 వేల 132 రూపాయలను ఆర్థికంగా అందజేశారు. వారి కుటుంబానికి అండగా మేమున్నామని ధైర్యాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మరియాల నాగిరెడ్డి, కొప్పుల సాగర్ రెడ్డి, సయ్యద్ మౌలానా, కందిబండ వెంకటేశ్వర్లు, షేక్ జానీ, బోయిన లక్ష్మీనారాయణ, బ్రహ్మచారి లింగపల్లి బిక్షం, ఇర్ల భూపతిరెడ్డి, వట్టే నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్న ప్రసన్న అక్షరాభ్యాస కార్యక్రమం



**జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** ఐసిడిఎస్ ప్రాజెక్టు జగిత్యాల ఎమ్ ఎల్ ఎ గారి ఆధ్వర్యంలో అతర్గం అంగన్వాడి సెంటర్ లో అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించవలనని పూర్వ ప్రాథమిక విద్య యొక్క ప్రాధాన్యతను వివరించడం జరిగినది అంగన్వాడి కేంద్రాలలో నర్సరీ ఎల్కేజీ యూకేజీ నిర్వహించడం జరుగుతుందని ఆటపాటల ద్వారా విద్యను అందించడం జరుగుతుందని వివరించడం జరిగినది ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గఎంపీడీవో రమాదేవి ఎంఈఓ గాయత్రీ సిడిపిఓ మమత సూపర్వైజర్.లావణ్య హెచ్ఎం మహిపాల్ రెడ్డిమరియు వారి యొక్క అధ్యాపక బృందం గ్రామ ప్రజలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం లో అయ్యప్ప దీక్ష మలధారణ స్వాముల నిత్య అన్నదానం..



**చౌటుప్పల్ నవంబర్ 21(క్రైమ్ మిర్రర్):** చౌటుప్పల్ శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం లో అయ్యప్ప దీక్ష మలధారణ స్వాముల నిత్య అన్నదానం కార్యక్రమం లో 1వ రోజు శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం లో అన్నదానం కార్యక్రమం నిర్వహించిన మొగుదాల రమేష్ గౌడ్ సాహితీ దంపతులు అన్నదానం నిర్వహించడం జరిగింది. వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని అయ్యప్పస్వామి ని మనసారా కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో బత్తుల విప్లవ్ గౌడ్,అన్నదానం నిర్వకులు తూర్పునూరి నర్సిహ్మ గౌడ్,సన్నిధానం గురుస్వాములు చెవగొని మహేష్ గౌడ్,ఐతగొని శ్రీను,బత్తుల మల్లేష్ గౌడ్, రాజు, మరగొని గణేష్ గౌడ్, ఉప్పునూతల నర్సింహ, మేకల అనిల్, సన్నిధానం స్వాములు మీసాల శ్రీకాంత్,జగన్,మార్గం శేఖర్,సప్పిడి శేఖర్ రెడ్డి, చెవగోని శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు..

## పారిశుద్ధ్య పనులు నిర్వహించే సమయంలో కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

**బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర**



**గండిపేట్(క్రైం మిర్రర్):** పారిశుధ్య కార్మికులు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని అప్పా జంక్షన్ సమీపంలోని ప్రధాన రహదారిపై జరుగుతున్న స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారిపై స్వీపింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రిఫ్లెక్టింగ్ రేడియం జాకెట్లు, సేఫ్టీ కోన్లు ఉపయోగించి వేగంగా వచ్చే వాహనాలు దృష్టిలో పెట్టుకోని అప్రమత్తంగా ఉంటూ పని చేయాలని సూచారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం

### ప్రజా ఆరోగ్యం-ప్రమాణాలతో కూడిన విద్య ప్రభుత్వ బాధ్యత

### రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా





**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ఉత్తర తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తాలో 300 కోట్ల రూపాయల నిధులతో మంజూరైన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి రాష్ట్ర ఐ.టి., పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్స్ %ఉ% కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టి.జి.ఎం.ఎస్.ఐ.డి.సి. ఎం.డి. హేమంత్ బొర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, తెలంగాణ మినిమమ్ వేజెస్ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.డి. సులేమాన్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రాంతంలో మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని, ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు మంచి ఆలోచన అని, పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు, ప్రమాణాలతో కూడిన విద్య అందించడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటుందని తెలిపారు. వైద్య సేవల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా 90 శాతం వైద్యం ఇదే ప్రాంతంలో ఉచితంగా అందించి ప్రజలలో భద్రత, నమ్మకం కలిగిస్తామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 6 పడకలను 30 పడకలకు అప్ గ్రేడ్ చేయడంతో పాటు మరిన్ని ఉప కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 7 వేలకు పైగా వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని, సుమారు 54 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అత్యవసర సేవల సమయంలో వేగవంతమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అంబులెన్స్ సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, గిరిజన ప్రాంతాలలో 2, మండలానికి 1 చొప్పున అందించేందుకు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ప్రతి 30-35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర వ్యాప్తంగా 74 ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రజలు ప్రాణాపాయానికి గురి కాకుండా బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో అంబులెన్స్లు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని కిడ్నీ డయాలసిస్ కేంద్రంలో 10 పడకలను 30 పడకలకు పెంచడంతో పాటు డయాబెటిక్ వ్యాధిగ్రస్తుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో అదనంగా 29 ఉప కేంద్రాల ఏర్పాటుతో పాటు మంచిర్యాల నియోజకవర్గంలోని వెంకట్రావుపేట, చెన్నూర్ నియోజకవర్గంలోని అంగ్రాస్ పల్లి లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉత్తర తెలంగాణలో 4 క్యాన్సర్ కేంద్రాలు, వస్కులర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది సంఖ్యను పెంచి ప్రజలకు వైద్య సేవలను సంపూర్ణంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహిళలను విద్యావంతులను చేసి సమాజంలో అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు, . రాష్ట్ర ఐ.టి., పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం సంవత్సర కాలంలో అనేక రంగాలలో అభివృద్ధి సాధించిందని, ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీ నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా 7 నియోజకవర్గాలు, మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్, ఇతర రాష్ట్రాల నుండివైద్య సేవల నిమిత్తం వచ్చే ప్రజలకు అందుబాటులో అన్ని సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధికప్రాధాన్యతని ఇస్తుందని, ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది నియామకానికిచర్యలు తీసుకుంటామని తెలిపారు. అకుంఠిత దీక్షతో ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, మంచిర్యాలలో వరదప్రభావిత ప్రాంతాలు ముంపుకు గురికాకుండా 262 కోట్ల రూపాయల వ్యయంతో కరకట్టనిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.పారిశ్రామిక వాడల అభివృద్ధికి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో మొదటిసారిగా మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా ప్రజలకు మందులను అందుబాటులో ఉంచేందుకు డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 6 గ్యారంటీల అమలుకు ఆర్థిక క్రమశిక్షణతో చర్యలు చేపడుతున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, వసతి గృహ విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచడం జరిగిందని తెలిపారు. 2 లక్షల రూపాయల రుణమాఫీలో భాగంగా రైతులకు 3 విడతలలో రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ క్రింద అందించడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని, సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించామని, 800 మెగావాట్ల సామర్థ్యంతో 3 పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దాదాపు 15 లక్షల మందికి ఉపయోగపడుతుందని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని వారికి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటు కొరకు ప్రభుత్వం 300 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, 225 పడకలతో మాత శిశు, 425 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి కలిపి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం కొరకు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఇక్కడే పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా జిల్లాతో పాటు పక్క రాష్ట్రాల నుండి వచ్చే ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## పాపిరెడ్డి నగర్ శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయంలో అయ్యప్ప స్వాములకు నిత్యం బిక్ష ప్రసాదం...

### భక్తులందరు స్వామి పాద సేవలో పాల్గొనాలి...

### గడ్డం రాజేశ్వర్ రెడ్డి గురుస్వామి

**కూకట్ పల్లి, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్):** శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం కమిటీ ఆలయంలో గురువారం నుండి డిసెంబర్ నుండి 31వరకు అయ్యప్ప స్వాములకు ప్రతి రోజూ భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గడ్డం రాజేశ్వర్ రెడ్డి గురుస్వామి తెలిపారు. అందులో భాగంగా గురువారం మొదటి రోజు అందరు స్వాములు బిక్ష కార్యక్రమంలో పాల్గొని భిక్ష చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తులు అందరూ కలిసి ఈ విధంగా భిక్ష కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి, నరసింహారెడ్డి స్వామి, కుమారస్వామి, అప్పల నాయుడు స్వామి, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, రమేష్ యాదవ్, చిట్టి రెడ్డి గోపాల్ రెడ్డి, సాయి స్వామి, కరుణాకర్ స్వామి, రవీందర్ రెడ్డి, వీరన్న, సంపత్ రెడ్డి, దశరథ్, మధు స్వామి, శివ స్వామి, ధర్మా రెడ్డి స్వామి, నరసింహ స్వామి మరియు అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమీషనర్ బి.శరత్‌చంద్ర




**గండిపేట్(క్రైం మిర్రర్):** పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపై ఉంటుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా 8,9,11,15,16 డివిజన్‌లలోని ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్స్, ఆసుపత్రుల పరిసరాల పరిశుభ్రత, నిల్వ ఉన్న స్టాగ్నెట్ వాటర్, మంచినీటి సరఫరా ఏర్పాట్లు, రిపేర్లు, పిచ్చి మొక్కలు తొలగింపు తదితర పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

### గండిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం భోగాల శ్రీకాంత్





బోగల శ్రీకాంత్

**గండిపేట్, (క్రైం మిర్రర్) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ సర్వేనెంబర్ 62 లోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని గండిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం భోగాల శ్రీకాంత్ కోరారు. సర్వే నెంబర్ 62 లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నారని, సదరు నిర్మాణాన్ని అడ్డుకోవాలని పలుమార్లు గండిపేట్ మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అయినా చర్యలు తీసుకోకుండా ఆ నిర్మాణదారుడికి అధికారులు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందాయని, అందుకే నిర్మాణదారుడికి సహకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

### మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ గఫార్

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మండలం పరిధిలోని నేరళ్ళ పల్లి గ్రామం నందు ఎండి.సఖీన ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రోజున మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ గఫార్ సఖీనా మృతదేహానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం 10,000/- రూపాయలు సహాయం ఆర్థిక సహాయం అందించడం జరిగింది. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా ఏ సమయంలో నైన సహాయం కోరి వచ్చిన వారికి సమస్యలను పరిష్కరిస్తూ, తమ శక్తి కొద్దీ సహాయం గఫార్ చేస్తున్నారని పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బచ్చన బోయిన రమేష్, మాద రమేష్, గున్నె బోయిన యాదయ్య, మల్లయ్య, రాములు, బచ్చన బోయిన కొండల్, సత్తయ్య, వెంకన్న, వంగూరి సైదులు, ఉడుత పర్వతాలు, ఎడ్ల వెంకన్న, శ్రీరాములు, మేకల రాజు, కర్నాటి అంజి, పల్లె క్షేత్రయ్య, చాంద్ పాషా, సైదుసేన్, హుస్సేన్, కొన్రెడ్డి రామస్వామి, బారి యాదయ్య, వడ్డేపల్లి ఉడుత యాదయ్య, చాపల వెంకన్న, ఎడ్ల చంద్రయ్య, పొలగోని నాగరాజు, పెద్దులు ఆక నర్సింహా, లింగయ్య, ప్రభు, నరసమ్మ, తదితర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.





## మానవత్వం చాటుకున్న రాజ్ కుమార్ రెడ్డి

**నారాయణపేట, క్రైమ్ మిర్రర్:** నారాయణపేట-మహబూబ్ నగర్ రోడ్డు మార్గంలో దన్వాడ సమీపంలో యువకులు వెళ్తున్న ద్విచక్ర వాహన ప్రమాదవశాత్తు చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. సహాయం అందించాలని కోరుతూ ఆ యువకులు వేడుకునే విషయాన్ని గమనించిన భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్ రెడ్డి కారును ఆపారు. చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన బైక్ ను బయటకు తీసి వారికి నీటిని తాగించి సురక్షితంగా అక్కడి నుండి పంపించారు. రాజ్ కుమార్ రెడ్డి తదితరులు చేసిన సహాయానికి ప్రమాదానికి గురైన యువకులు ధన్యవాదాలు చెప్పారు. రాజ్ కుమార్ రెడ్డి వెంట ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, లక్షణ్, శివ, మహేష్ తదితరులు ఉన్నారు.

# మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ వైఖరికి కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన



**క్రైమ్ మిర్రర్, మిర్యలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ తిరునగరు భార్గవ్ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు.కాంగ్రెస్ కౌన్సిలర్లు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీగా ప్లకార్డులు పట్టుకొని మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని, సమావేశ మందిరంలో నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ ద్వారం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు మాట్లాడారు. వారు మాట్లాడుతూ, "ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ గత 15 సంవత్సరాలుగా మున్సిపల్ ఖజానా దోచుకొని, అవినీతి పనులకు పాల్పడ్డారు. ఇప్పుడు డ్రామాలు ఆడుతూ ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారు" అని విమర్శించారు.అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చి, టీఎస్ పాస్ ప్రాజెక్టులకూ అవినీతి కల్పించారని ఆక్షేపించారు. గతంలో కమిషన్ల కోసం ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కుతూ లాభాలు ఆర్జించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పార్టీలో చేరాలని ప్రయత్నించే చైర్మన్ నాటకాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు.ఇలాంటి అవినీతి వ్యక్తులను మా పార్టీలోకి రానివ్వమని స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, డిసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సలీం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్‌లు ఐక్యతతో అభివృద్ధి చెందాలి

**ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మొద్దు ధర్మపురి ముదిరాజ్, ఉపాధ్యక్షులు చిగురు బాల్‌రాజ్‌ముదిరాజ్**

**గండిపేట్(క్రైం మిర్రర్):** ముదిరాజ్‌లంతా ఐక్యమత్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మొద్దు ధర్మపురి ముదిరాజ్, ఉపాధ్యక్షులు చిగురు బాల్‌రాజ్‌ముదిరాజ్‌లు అన్నారు. తెలంగాణ మహాసభ ముదిరాజ్ ఆవిర్భావ దినోత్సవం, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం తరపున జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బుడాల గండయ్యముదిరాజ్, సొమయల రాజుముదిరాజ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు బుడాల అరుణ్‌కుమార్‌ముదిరాజ్, సొమయాల విఠల్‌ముదిరాజ్, చిగురు రాజుముదిరాజ్, సొమయలా మల్లేష్‌ముదిరాజ్, బుడాల కృష్ణముదిరాజ్, గోర్నకల నర్సింహ్మముదిరాజ్, నాగరాజ్ ముదిరాజ్, గోరేంకల గిరీ ముదిరాజ్, మొద్దు సాయిరాంముదిరాజ్, బుడాల అరవింద్‌ముదిరాజ్, మొద్దు దేవేందర్‌ముదిరాజ్, సొమయాల ఆర్యాముదిరాజ్, మొద్దు రాకేష్‌ముదిరాజ్, సొమయాల లడ్డూముదిరాజ్, పాలారాముముదిరాజ్, సొమయాల కిరణ్‌ముదిరాజ్, మొద్దు పవన్‌ముదిరాజ్, కొండకళ్ల శేఖర్‌ముదిరాజ్, పాలాభాల ముదిరాజ్, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమైన 5 పథకాలు ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

**ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరిగి సుధాకర్ మహారాజ్**




**క్రైమ్ మిర్రర్, నాంపల్లి** నాంపల్లి మండల తహసిల్దార్ గుగులోతు దేవా సింగ్ కి ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈ బీ సీ ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి కల్పించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డి.ఎస్.పి జిల్లా కో కన్వీనర్ గిరి మహారాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 90 శాతం ఉన్న పేద బలహీన వర్గాలకు చెందిన దాదాపు ఒక కోటి కుటుంబాలు ఉన్నాయని, వీరు ముఖ్యంగా ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి, భూమి, సొంత ఇల్లు వంటి ముఖ్యమైన ప్రధాన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి జిల్లా కో కన్వీనర్ గిరి మహారాజ్ మండల అధ్యక్షుడు ఇరిగి సుధాకర్ , ఉపాధ్యక్షులు చిరంజీవి, గిరి, రావణ్, ప్రధాన కార్యదర్శులు సురేష్, నరేందర్, కార్యదర్శులు రమేష్, శివన్, పండు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు మెరుగు జితేందర్





**గండిపేట్(క్రైం మిర్రర్):** దోమల వృద్ధిని నిర్మూలించేందుకు ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు మెరుగు జితేందర్ సూచించారు. నెక్నాంపూర్ చెరువు పెద్ద చెరువులో జీహెచ్ఎంసీ, మణికొండ మున్సిపాలిటీ వారి సహకారంతో జరుగుతున్న గుర్రపు డెక్క తోలగింపు పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్కాపూర్ టౌన్‌షిప్ వాసులు, ఇతర కాలనీల వాసులు దోమల బెడద కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎఫ్‌టిసి మిషనరీతో ఈ పనులు చేస్తున్న కార్మికుల పనులను వారు పర్యవేక్షించారు. వారికి కావాల్సిన అవసరమైన సహాయ సహకారాలను అందించామన్నారు. ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. ఈ పనులను త్వరలో పూర్తి చేసి పెద్ద చెరువులో గుర్రపు డెక్క లేకుండా చేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహక అధ్యక్షులు కిరణ్‌కుమార్, కౌన్సిలర్ పురుషోత్తం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్**



గండిపేట్(క్రైం మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. దుర్గానగర్ క్రాస్ రోడ్డు నుంచి దుర్గా కన్వెన్షన్ మీదుగా పి%-%1 రోడ్డు వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న బాక్స్ డ్రైన్ పనులను అధికారులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. బాక్స్ డ్రైన్ పక్కన మట్టి ఫిల్లింగ్ చేసి వాహనాదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ రవికుమార్, డిఈ, ఏఈ, మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, ప్రేమ్ గౌడ్, బాస శ్రీనివాస్ నేత, లక్ష్మారెడ్డి, బోనకుర్తి రాము నేత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో మణికొండ మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు

**బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**





**గండిపేట్(క్రైం మిర్రర్):** పర్యావరణ పరిరక్షణలో మణికొండ మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, మాల్యాద్రి నాయుడు, అందె లక్ష్మణ్‌రావుల ఆధ్వర్యంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వారి అభిప్రాయాలను తీసుకోని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహార కార్యక్రమం పూర్తిగా నీరు గారిందని దీనికి ప్రధాన కారణం అధికారులే అన్నారు. గత ప్రభుత్వం రోడ్ల పక్కన మొక్కలను నాటితే అధికారులు వాటి బాధ్యత చూసుకోకుండా గాలికి వదిలేశారన్నారు. ప్రజల సొమ్మును దర్వినియోగం చేస్తున్నారని, పర్యావరణ పరిరక్షణలో మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా విఫలమైయ్యారని అన్నారు. ఈ మేరకు గోల్డెన్ టెంపుల్ కూడలిలో కలుసుకోని పాదయాత్ర మొదలుపెట్టి పర్యవేక్షణ లోటుతో పాటు మొక్కల మధ్య కరెంట్ తీగలు, తీగల బాక్స్‌లు ఉండడం గమనించి అందు వలన ప్రజలకు ప్రాణహాని కలిగించవచ్చని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్‌కుమార్, ముత్తంగి లక్ష్మయ్య, ఉపేంద్రనాథ్‌రెడ్డి, యాలాల కిరణ్, షేక్ ఆరీఫ్, జైరాం, బోడ్డు శ్రీధర్, భాను తదితరులున్నారు. అనంతరం ఈ సమస్యపై మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు.

## మిర్యాలగూడలో ఆపరేషన్ చెబుత్ర

**అర్ధరాత్రి తనిఖీలలో 32 మంది, 26 వాహనాలు అదుపులో**





**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో బుధవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ కె. రాజా శేఖర్ రాజు ఆదేశాల మేరకు "ఆపరేషన్ చెబుత్ర" కింద ఈ చర్యలు చేపట్టారు.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్న 26 వాహనాలు, అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి వాహనాల పత్రాలను పరిశీలించారు. సరైన డాక్యుమెంట్లు లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అర్ధరాత్రి రోడ్లపై తిరిగే వ్యక్తులను కౌన్సెలింగ్ చేసి, ఈ తరహా ప్రవర్తన పునరావృతమైతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైండోవర్‌లతో వారిని విడుదల చేశారు.ఈ ఆపరేషన్‌లో మిర్యాలగూడ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోట కరుణాకర్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సబ్ ఇన్‌స్పెక్టర్లు సుధీర్ కుమార్,రాంబాబు, శ్రీనివాస్, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
9393446188

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# తెలంగాణ పోలీస్ అకాడామీలో కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్



**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడామీలో గురువారం కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ హజరైయ్యారు. తెలంగాణ పోలీస్ అకాడామీ డైరెక్టర్, డీజీపీ అభిలాష బిష్త్ శిక్షణార్థుల ప్రమాణం చేయించారు. కానిస్టేబుళ్లు చేసిన 9 నెలల శిక్షణ కోసం ప్రిన్సిపాల్, పిటిసి, అడిషనల్ ఎస్పీ వేమా శ్రీనివాస్‌రెడ్డి శిక్షణ నివేధికను అందించారు. ఎస్‌సీటీ పీసీలు (సివిల్), టీజీపీఏ నుంచి 560, ఎస్‌సీటీ పీసీలు (ఏఆర్) టీజీపీఏ 278, ఎస్‌సీటీ పీసీలు (ఏఆర్) చెల్లాపూర్ 292, ఎస్‌సీటీ పీసీలు (ఐటీఅండ్‌సీ) బేగంపేట్ 81 మందికి శిక్షణ పూర్తి చేసుకున్నారు. 2024 బ్యాచ్ సైటపెండియరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ ఈ అకాడామీలో పరేడ్‌లో 1211 మంది క్యాడెట్‌లు( అందరూ మహిళలు) ఉన్నారు. ఈ బ్యాచ్‌లో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో వరంగల్(166), రామగుండం(120), కరీంనగర్(104) నుంచి ట్రైనీలు ఉన్నారు. ఈ బ్యాచ్‌లో ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంసీఏ వంటి స్ట్రీమ్‌లలో 194 పోస్ట్%-%గ్రాడ్యుయేట్‌లతో అధిక అర్హత కలిగిన వ్యక్తులు సైతం ఉన్నారు. ఎంటెక్, ఎంఫార్మసీ ట్రైనీలలో 56 శాతం మంది 21%-%25 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఉన్నారు. 10 మంది గతంలో ప్రభుత్వ, ప్రభుత్వ రంగాల్లో విధులు నిర్వహించగా ఆరు మంది హోంగార్డులుగా పని చేశారు. 1201 మంది ఫ్రెషర్లు ఉన్నారు. 68 మంది క్యాడెట్లు పోలీసు కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. కఠినమైన క్రమ శిక్షణ, సమయాలు, పాఠ్యాంశాల కారణంగా శిక్షణ పొందిన వారికి ప్రారంభ శిక్షణ రోజులు కష్టంగా ఉంటాయన్నారు. వారికి సర్దుబాటు చేయడానికి సమయం పట్టిందని, ప్రారంభ రోజుల్లో శిక్షన నుంచి నిష్క్రమించమని ధరఖాస్తు చేసుకున్న వారికి సీనియర్ కార్యాలయాలు, నిపుణులైన కౌన్సిలర్లు ద్వారా కౌన్సిలింగ్ సెషన్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక నెల తరువాత వారు సర్దుబాటు చేయగలరు, ఆకులు, సెలవు దినాలలో అనుమతించబడ్డాయన్నారు. ఇదది ఇంటి అనారోగ్యాన్ని అధిగమించడంలో వారికి సహయపడిందన్నారు. ప్రతి పదిహేను రోజులకు శిక్షణార్థులు ఎదుర్కనే ఏవైనా వ్యక్తిగత సమస్యలకు సంబంధించి ఒకరితో ఒకరు సలహాలు ఇవ్వడానికి బయటి నుంచి నిపుణులైన కౌన్సిలర్ నిమగ్నమై తక్షణ పరిష్కారానికి సూచించబడ్డాయన్నారు. వారాంతాల్లో సాంస్కతిక కార్యక్రమాలు వారిని ఉత్సాహపరిచేలా నిర్వహించడం జరిగిందన్నారు. శంకర్ ఫౌండేషన్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరగతులు మొదలైన ఎన్‌జీవోలచే నత్య కార్యక్రమాలు, ఆటలు, సాంస్కతిక కార్యక్రమాలు వారు కఠినమైన శిక్షణా పాఠ్యాంశాలను ఎదుర్కొవడంలో సహాయపడ్డాయన్నారు. బోనాలు పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారన్నారు. ఇందులో టిజిపిఏ అన్ని పోలీసు అధికారులతో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు. బ్యాచ్ కానిస్టేబుల్ ట్రైనీలకు సాంప్రదాయ, ఆధునిక చట్ట అమలు పద్దతులను ఏకీకతం చేసే ప్రగతిశీల పాఠ్యాంవాలు బోధించబడ్డాయన్నారు. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, ఎన్‌డిపిఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టాలపై ప్రత్యేక దష్టి పెట్టబడిందన్నారు. భారత ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన క్రిమినల్ చట్టాలతో పాటు సమకాలీన నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి శిక్షణ పొందిన వారికి అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ బ్యాచ్ సైటస్ మేనేజ్‌మెంట్, సెల్ఫ్ డిపెన్స్, కమ్యూనిటీ రిలేషన్స్‌లో ప్రత్యేక శిక్షణను కూడా పొందిందని, పోలీసింగ్ మానసిక, శారీరక అవసరాల కోసం వారిని సిద్ధం చేసిందన్నారు. క్యాడెట్ పిసిలు పార్లమెంటు ఎన్నికలు, గణేష్ నిమర్జనం బందోబస్తు వంటి ప్రధాన కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆచరణాత్మక అనుభవాన్ని పొందారన్నారు. వారి శిక్షణ మొత్తం క్యాడెట్ పీసీలు వారి విద్యాసంబంధమైన , ఫీల్డ్ పనితీరును పర్యవేక్షించడానికి క్రమం తప్పకుండా మూల్యాంకనానికి గురయ్యారన్నారు. చివరి పరీక్షలలో కందుల మమత(ఎస్‌సీటీ పీసీస్ సివిల్) 1146.40 మార్కులతో (1400)కి ఉత్తమ ఆల్ రౌండ్ ప్రదర్శనగా ట్రోఫీని సంపాదదించి, ఓవరాల్ టాపర్‌గా నిలిచిందన్నారు. ఇండోర్ సబ్జెక్టులలో చింత




రమాదేవి 658.85 మార్కులతో(800)కి బెస్ట్ ఇండోర్ ట్రోఫీని గెలుచుకున్నారన్నారు. సోనియా (ఎస్‌సీటీ పీసీస్ సివిల్) అవుట్ డోర్ సబ్జెక్టులలో 580.80 మార్కులతో(600కి) అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అత్యుత్తమ అవుట్ డోర్ ప్రదర్శన కోసం ట్రోఫీని సంపాదించిందన్నారు. ఫైరింగ్‌లో పెద్దోళ్ల ప్రకతి 93 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ ఫైరింగ్‌గా ట్రోఫీని గెలుచుకున్నారు. యూ.సౌమ్య (ఎస్‌సీటీ పీసీలు ఏఆర్) ఓవరాల్ టాపర్‌గా ఉద్భవించింది. 1005.60 మార్కులతో (1200)కి, ఇండోర్ సబ్జెక్ట్‌లలో 503.60 మార్కులతో(600)కి ట్రోఫీని సంపాదించి, అత్యుత్తమ ఆల్ రౌండ్ ప్రదర్శనగా ట్రోపీని సంపాదించింది. ఉత్తమ ఇండోర్ కోసం వి.కష్ణవేణి(ఎస్‌సీటీ పీసీలు ఏఆర్) అవుట్‌డోర సబ్జెక్టులలో 515 మార్కులతో (600కి) అగ్రస్తానంలో నిలిచింది. ఉత్తమ అవుట్‌డోర్ ప్రదర్శనకు ట్రోఫిని సాంపాదించింది. ఫైరింగ్‌లో లోలుగు భవాని 92 మార్కులో ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ ఫైరింగ్‌గా ట్రోఫిని గెలుచుకుంది. చెలాపుర శిక్షణా కేంద్రం నుంచి జి.దివ్య(ఎస్‌సీటీ పీసీలు ఏఆర్) 949 మార్కులో (1200కి) అత్యుత్తమ ఆల్ రౌండ్ ప్రదర్శనగా ట్రోఫిని సంపాదించారు. ఓవరాల్ టాపర్‌గా నిలిచింది. ఇండోర్ సబ్జెక్ట్‌లో ఈ.శిరీషా 512 మార్కులతో (600కి), బెస్ట్ ఇండోర్ ట్రోఫీని గెలుచుకుంది. కె. నిఖిల (ఎస్‌సీటీ పీసీలు ఏఆర్) అవుట్ డోర్ సబ్జెక్టులో 470.50 మార్కులతో (600కి) అగ్రస్థానంలో నిలిచింది. అత్యుత్తమ అవుట్‌డోర్ ప్రదర్శన కోసం ట్రోఫిని సంపాదించింది. ఆర్.రాధిక 94 మార్కులతో ఫైరింగ్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఉత్తమ ఫైరింగ్‌గా ట్రోఫీని గెలుచుకున్నారు. బేగంపేట శిఓణా కేంద్రం నుంచి కావలి రవళిక(ఎస్‌సీటీ పీసీలు ఐటీ అండ్ సీ) 1071.30 మార్కులతో (1300కి) అత్యుత్తమ ఆల్ రౌండ్ ప్రదర్శనగా ట్రోఫిని సంపాదించారు. ఓవరాల్ టాపర్‌గా నిలిచారు. చెలకల రజిత (ఎస్‌సీటీ పీసీలు ఐటీ అండ్ సీ) ఇండోర్ సబ్జెక్ట్‌లలో 769 మార్కులతో (900) ఉత్తమ ఇండోర్‌గా ట్రోఫిని గెలుపొందించారు.




# అనుకున్న లక్షాలను సాధించేందుకు కష్టపడాలి

## రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



**గండిపేట్(క్రైం మిర్రర్):** లక్ష్యాలను నిర్దేశించుకోని వాటిని సాధించేందుకు కష్టపడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఈ నెల 24వ తేదీన అల్కాపూర్ కాలనీలోని ఎంజీ పార్కులో జరగనున్న మానసిక వికలాగుల పిల్లల స్పోర్ట్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హజరుకావాలని కోచ్ వినోద్‌కుమార్ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ క్రీడాకారులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, శ్రవణ్ కుమార్, అమరేందర్ నాయకులు, కార్యకర్తలున్నారు.

# నేడు ఎంజీఐటీలో జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియమ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** మహాత్మా గాంధీ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి టెక్నికల్ సెంపోసియమ్ నిర్వహిస్తున్నట్లు ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెక్నికల్ సెంపోసియమ్ సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలకు గొప్ప వేధికగా నిలుస్తుందన్నారు. వివిధ విభాగాలు వారి ప్రత్యేక టెక్నికల్ ఫెస్టను నిర్వహిస్తున్నారన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ మైక్రోకాస్మ 2.0, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుక్తి, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ క్యూబిట్, కంప్యూటర్ సైన్స్ అండ్ మినింగ్ కాగ్నివర్జ్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ టెక్‌కృతి, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ నెక్స్‌ఫ్లోరా, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ పొటెన్షియా, మెకాట్రానిక్స్ టెక్నివేషన్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ మెటాలాన్, మెకానికల్ ఇంజనీరింగ్ ఇగ్నిటో, సివిల్ ఇంజనీరింగ్ సిన్ర్వా తదితర కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులలో సాంకేతికతను ప్రోత్సహించడానికి, వినోదాన్ని అందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాంకేతిక ఈవెంట్స్, ప్రాజెక్ట్ ఎక్స్పో, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సర్క్యూట్ రిలే, ఫైండ్ ది ఫాల్ట్, ఫాస్టెస్ట్ టు ఫినిష్, కోడ్ డిగ్, నాన్%-%టెక్నికల్ ఈవెంట్స్, ట్రెజరీ హంట్, ఐపీఎల్ ఆక్షన్, థగ్ ఆఫ్ వార్, ఇమేజ్ ప్రాంప్టింగ్, కన్వర్స్ పెయింగ్‌తో పాటు కళాశాల ప్రాంగణంలో ఫుడ్ స్టాల్స్‌తో పాటు స్టార్టప్ స్టాళ్లు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

# ఎక్సైజ్ అధికారుల ఘాటైన దాడి

## 944 కిలోల బెల్లం, 120 కిలోల పటిక స్వాధీనం

**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మాడ్గులపల్లి టోల్ గేట్ వద్ద గురువారం ఉదయం భారీగా అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ట్రక్కులో అక్రమంగా 944 కిలోల బెల్లం, 120 కిలోల పటికను తరలిస్తుండగా, రూట్ వాచ్‌లో ఉన్న అధికారులు ఈ ఘటనను గుర్తించారు. ఈ మేరకు మిర్యాలగూడ ఎక్సైజ్ సీఐ ఎల్. మహేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, నిందితులుగా డేగల రమేష్, లొట్లపల్లి మహేష్‌లను గుర్తించి, వారి పై కేసు నమోదు చేశామని తెలిపారు. వీరి వద్ద నుండి అశోక్ లేలాండ్ ట్రాలీతో పాటు తరలింపులో ఉన్న బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడి సమయంలో ఎస్ఐలు ఎస్కే పర్వీన్, లావణ్య,రాఘవేంద్ర గౌడ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్. ప్రభువరం తదితరులు పాల్గొన్నారు.



# పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్,ం వైస్ చైర్మన్ లను సన్మానించిన బొడ్ల బల్ రాజ్



**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్ :** కామారెడ్డి జిల్లా పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన చికోటి మనోజ్ కుమార్,వైస్ చైర్మన్ మా రెడ్డి కృష్ణారెడ్డి దొరను,పాలకవర్గ సభ్యులు నజీర్ సెట్,కారంగుల సాయి రెడ్డి పటేల్,మంగలి సాయినాథ్,పత్తేపురం రామవ్వ,సంజీవ్,సెక్రెటరీ శ్రీకాంత్ లను జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షులు,కామారెడ్డి జిల్లా ఆర్యవైశ్య యూత్ అధ్యక్షులు బొడ్ల బాల్ రాజ్ గురువారం పిట్లం మార్కెట్ కమిటీ ఆవరణలో శాలువాలు వేసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిట్లం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంబిగ హనుమన్లు,మాజీ జెడ్పిటిసి మురళీధర్ గౌడ్,చిల్లర్గి సొసైటీ వైస్ చైర్మన్ డాకుర్ వెంకట్ రెడ్డి,జుక్కల్ నియోజకవర్గ యూత్ నాయకులు ఇమ్రోజ్,మరగల దయానంద, కుమ్మరి చంద్రశేఖర్,అనుమ అశోక్, మహమ్మద్ నగర్ మండల యూత్ నాయకులు మల్లయ్య గారి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ట్రాఫిక్‌కు అంతరాయం

## పోలీసుల విధులకు ఆటంకం వ్యక్తిపై కేసు నమోదు

**క్రైమ్ మిర్రర్,మిర్యాలగూడ:** మద్యం సేవించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి,పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్ రాజు వెల్లడించారు. బుధవారం సాయంత్రం సుమారు 4.40 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టీఎస్-06-ఇబి-5224 నెంబర్ గల కారును రోడ్డుపై తప్పుగా పార్క్ చేసిన వ్యక్తి, ప్రయాణికులకు, వాహనాలకు తీవ్ర ఆటంకం కలిగించాడు. ఈ ఘటనను గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధీర్, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ బాబుకు సమాచారమిచ్చారు. ఎస్ఐ మోహన్ బాబు ఆదేశాలతో ట్రాఫిక్ సిబ్బంది కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో ఆ వ్యక్తి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. అయితే, అతని వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించిన పోలీసులు ఎదుర్కొన్నదేమిటంటే, ఆ వ్యక్తి దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడడం. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ రాజు తెలిపారు. ఈ ఘటన ప్రజలలో చర్చనీయాంశమైంది. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# కేరళకు రానున్న మెస్సీ బృందం



తిరువనంతపురం: అంతా అనుకున్నట్లు జరిగితే... భారత క్రీడాభిమానులు, కేరళ ఫుట్‌బాల్ ప్రేమికులు ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా జట్టు ఆటగాళ్ల విన్యాసాలు ప్రత్యక్షంగా చూస్తారు. రెండు అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడేందుకు... స్టార్ స్ట్రయికర్ లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు వచ్చే ఏడాది కేరళకు రానుందని ఆ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి అబ్దుల్ రహమాన్ బుధవారం ప్రకటించారు. ఈ మ్యాచ్‌లను కేరళ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని... వేదికతో పాటు, ప్రత్యర్థి జట్లు ఎవరనే విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని ఆయన చెప్పారు. ప్రస్తుతానికైతే ఖతర్, జపాన్ జట్లను ఆహ్వానించాలనే ఆలోచన ఉందని ఆయన వివరించారు. 'ఫుట్‌బాల్ స్టార్ మెస్సీతో కూడిన ప్రపంచ నంబర్‌వన్ ఫుట్‌బాల్ జట్టు అర్జెంటీనా వచ్చే ఏడాది కేరళకు రానుంది. ఆ జట్టు ఇక్కడ రెండు మ్యాచ్‌లు ఆడనుంది. దీనిపై అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘంతో కలిసి త్వరలోనే సంయుక్త ప్రకటన విడుదల చేస్తాం' అని రహమాన్ పేర్కొన్నారు. ఇటీవల స్పెయిన్ పర్యటన సందర్భంగా అర్జెంటీనా జాతీయ జట్టును ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. దీనికి ఆ జట్టు నుంచి సానుకూల స్పందన వచ్చిందని... త్వరలోనే దీనిపై మరింత స్పష్టత వస్తుందని అన్నారు. మ్యాచ్‌కు సంబంధించిన ఏర్పాట్లు, భద్రత తదితర అంశాలను ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని మంత్రి చెప్పారు. అయితే తమ షెడ్యూల్ ప్రకారం అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘమే భారత పర్యటనకు సంబంధించిన తేదీలను వెల్లడించనుందని పేర్కొన్నారు. అర్జెంటీనా ఆడనున్న మ్యాచ్‌ను ప్రత్యక్షంగా 50 వేల మంది అభిమానులు చూసేలా ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌ను నిర్వహించే శక్తి సామర్థ్యాలు కేరళ ప్రభుత్వానికి ఉన్నాయని రహమాన్ పేర్కొన్నారు. రెండు మ్యాచ్‌ల నిర్వహణకు రూ. 100 కోట్లు ఖర్చు అవుతుందని, ఈ మొత్తాన్ని స్పాన్సర్ల ద్వారా సమకూరుస్తామని ఆయన తెలిపారు.



## కుల గణన పేరుతో హిందువుల ఐక్యతను దూరం చేస్తున్నారు: బిబి ఆర్ వేణు

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేసిన ౹ బిబిఆర్**

**మైనార్టీలకు కూడ కుల గణన చేసి తక్షణమే వివరాలు వెల్లడించాలి**

**కులగణన పారదర్శకంగా నిర్వహించే సర్వే డేటాను పబ్లిక్ డోమైన్ లో పెట్టాలి**

**రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కు వినతి పత్రం అందచేసిన బిబి ఆర్ వేణు**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్ ):** లిరాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా కన్వీనర్ బిబి ఆర్ వేణు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బిబి ఆర్ వేణు విలేకరులతో మాట్లాడుతూ బీసీల ఐక్యతను విడగొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆయన అన్నారు.ముస్లింలకు 4%శాతం ఇవ్వడం బిజెపి పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ముస్లింలలో కూడా అనేక కులాలు ఉన్నాయని వాటిని కూడా పూర్తి సర్వే చేసి పూర్తి సమాచారాన్ని తెలియజేయాలని ఆయన కోరారు.కులగణన పారదర్శకంగా నిర్వహించే సర్వే డేటాను పబ్లిక్ డోమైన్ లో పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో హిందువుల ఐక్యమత్యంగా ఉండకుండా విడగొట్టడానికి కుల గణన సర్వే పేరుతో హిందువులను మోసం చేస్తుందని ఆయన ఇద్దేవా చేసాడు రాబోయే ఎన్నికలవరకు సర్వే పారదర్శకంగా చేసి ప్రతి విషయాన్ని బట్టబయలు చేయాలన్నారు. ముస్లింలలో అన్ని కులాలను పూర్తి సర్వే చేసి అందరికీ తెలిసే విధంగా స్పష్టం చేయాలన్నారు.హిందువులు కులగల సర్వే పట్ల అప్రమత్తంగా ఉండాలని హిందువుల ఐక్యమత్యంగా ఉంటేనే మనం రాబోయే రోజుల్లో కలిసి మెలిసి ఉండే అవకాశం ఉంటుందని అన్నారు లేకపోతే హిందువులను దెబ్బతీసి మనం ఆ దేశంలో రాష్ట్రంలో బతికే పరిస్థితి లేకుండా పోతుందని ఆయన అన్నారు.హిందువులకు రావాల్సిన రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో

బీజేపీ ఓబీసీ మోర్చా గీత సెల్ రాష్ట్ర కో కన్వీనర్ రాగుల కిరణ్ కుమార్ గౌడ్,ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి తలగామా అంజయ్య,పాలకూరి నరేష్ గౌడ్, నాగునూరి నాగరాజు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# టెస్ట్ వార్..




**నేటి నుంచి బోర్డర్-గవాస్కర్ సిరీస్**

**ఒత్తిడిలో భారత్, ప్రతీకారానికి ఆసీస్**

**టీమ్ఇండియా తుదికూర్పుపై ఆసక్తి**

**ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)కి రంగం సిద్ధమైంది. సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో మేటి జట్లుగా వెలుగొందుతున్న భారత్, ఆస్ట్రేలియా కదనరంగానికి సై అంటున్నాయి. పేస్‌కు స్వర్గధామైన పెర్త్ పిచ్‌పై టెస్టు వార్‌లో తాడోపేడో తేల్చుకోనున్నాయి. గత రెండు సార్లు ఆసీస్‌ను వారి సొంతగడ్డపైనే మట్టికరిపించిన టీమ్ఇండియా..ముచ్చటగా మూడోసారి కప్‌ను ముద్దాడాలని చూస్తున్నది. రోహిత్‌శర్మ, గిల్, షమీ గైర్హాజరీలో బుమ్రా కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న భారత్ ఒకింత ఒత్తిడిలో కనిపిస్తున్నది. సొంత ఇలాఖాలో తమకెదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకునేందుకు కంగారూలు పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యారు. యాషెస్‌ను తలదన్నే రీతిలో జరిగే బీజీటీ సిరీస్‌లో ఆధిపత్యం ఎవరిదో చూడాలి.**

పెర్త్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ)లో భారత్, ఆస్ట్రేలియా తొలి పోరుకు వేళయైంది. శుక్రవారం నుంచి పెర్త్ వేదికగా రెండు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీసకు తెరలేవను ంది. గతానికి భిన్నంగా ఈసారి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు తలపడబోతున్నాయి. ఓవైపు స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌తో భారత్ ఒత్తిడిలో ఉంటే.. చాలా రోజుల తర్వాత సొంతగడ్డపై ఆసీస్ టెస్టు సిరీస్ ఆడబోతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యర్థి చేతిలో క్లీన్‌స్వీప్‌నకు గురైన టీమ్ఇండియా..వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)నకు అర్హత సాధించాలంటే ఆసీస్‌పై ప్రతీ మ్యాచ్ కీలకం కాబోతున్నది. దీనికి తోడు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్‌శర్మ లేకుండానే టీమ్ఇండియా పెర్త్ టెస్టు ఆడబోతున్నది. రెండో సంతానం కోసం స్వదేశంలోనే ఉండిపోయిన రోహిత్..మూడో రోజు ఆట నాటికి జట్టుతో చేరనున్నాడు. బుమ్రా సారథ్యంలో భారత్..ఆసీస్‌కు చెక్ పెడుతుందా లేక కివీస్‌పై పేలవఫామ్‌ను కొనసాగిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు గత రెండు పర్యాయాలు టీమ్ఇండియా చేతిలో అనూహ్య సిరీస్ ఓటములు ఎదుర్కొన్న ఆసీస్ ఈసారి మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు పావులు కదుపుతున్నది.

**తుది కూర్పులో ఎవరో?**

ఆసీస్‌తో తొలి టెస్టుకు టీమ్ఇండియా తుది కూరుపై అభిమానుల్లో ఆసక్తి నెలకొన్నది. ఓవైపు ప్రాక్టీస్ మ్యాచ్‌లో గాయపడ్డ శుభ్‌మన్‌గిల్ దూరం కాగా, కెప్టెన్ రోహిత్‌శర్మ రెండో టెస్టుకు జట్టులోకి రానున్నాడు. ఈ నేపథ్యంలో ఎవరికి అవకాశం లభిస్తుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. గాయం నుంచి తేరుకున్న రాహుల్..జైస్వాల్ జతగా ఓపెనింగ్ దిగే చాన్స్ కనిపిస్తున్నది. ఇదే జరిగితే మూడో స్థానంలో దేవదత్ పడిక్కల్ బ్యాటింగ్‌కు రావచ్చు. మిడిలార్డర్‌లో ధృవ్ జురెల్, సర్ఫరాజ్‌ఖాన్ మధ్య తీవ్ర పోటీ ఉంది.ఆస్ట్రేలియా 'ఏ'తో అనధికారిక టెస్టుల్లో జురెల్ ఆకట్టుకోగా, సర్ఫరాజ్ నిలకడలేమి టీమ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతున్నది. యువ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్‌రెడ్డి టెస్టు అరంగేట్రం దాదాపు ఖాయంగా కనిపిస్తున్నది. పేస్‌కు సహకరించే పెర్త్ పిచ్‌పై నితీశ్ ఆల్‌రౌండ్ సేవలు జట్టుకు బాగా ఉపయోగపడనున్నాయి. లోయార్డర్‌లో బ్యాటింగ్‌కు తోడు బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్‌సింగ్‌కు నితీశ్ జత కలిస్తే ఆసీస్‌ను అడ్డుకునేందుకు అవకాశం లభిస్తుంది. ఏకైక స్పిన్నర్ కోటాలో అశ్విన్ జట్టులోకి రావచ్చు.

**బౌలింగ్ బలంగా:** సొంతగడ్డపై భారత్‌పై ఆధిపత్యం చెలాయించాలనుకుంటున్న ఆసీస్‌కు బౌలింగ్ బలంగా ఉండగా, బ్యాటింగ్ విభాగం కలవరపెడుతున్నది. వార్నర్ లేకుండా ఆడుతున్న ఆసీస్..యువ బ్యాటర్ మెక్‌స్వీనిపై భారీ ఆశలు పెట్టుకుంది. ఖవాజా జతగా మెక్‌స్వీని ఆసీస్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నారు. దీనికి తోడు ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో స్మిత్ సగటు 36 కాగా, లబుషేన్ సగటు గత రెండేండ్లలో 30 కంటే పడిపోయింది. మెగాటోర్నీల్లో భారత్‌కు విలన్‌గా మారిన హెడ్ సగటు కూడా తక్కువ(28)గానే ఉంది. మిడిలార్డర్‌లో హెడ్, మార్ష్, క్యారీ, కమిన్స్ ఎలా రాణిస్తారనే దానిపై ఆసీస్ ఆధిక్యం ఆధారపడి ఉంది.




# హమ్మయ్య! పుజారా లేడు

## ఆసీస్‌కు మేలు: హాజిల్‌వుడ్

పెర్త్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చిన భారత జట్టులో 'నయా వాల్' ఛతేశ్వర్ పుజారా లేకపోవడం ఆతిథ్య జట్టుకు ఎంతో కలిసొస్తుందని ఆసీస్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ అభిప్రాయపడ్డాడు. గత రెండు పర్యటనలలో భారత్..బీజీటీని సొంతం చేసుకోవడంలో పుజారాది కీలకపాత్ర. హాజిల్‌వుడ్ మాట్లాడుతూ 'ఈసారి భారత జట్టులో పుజారా లేకపోయినందుకు నాకు సంతోషంగా ఉంది. గత రెండు పర్యటనలలో అతడు కీలకపాత్ర పోషించాడు. అతడి వికెట్ తీసేందుకు ప్రతిసారి ప్రయత్నించేవాడిని' అని అన్నాడు. పుజారా లేకపోయినా ప్రస్తుతం భారత జట్టులో అద్భుతంగా ఆడగల నైపుణ్యమున్న ఆటగాళ్లు చాలామంది ఉన్నారని అన్నాడు. ఖలీల్ స్థానంలో దయాల్ లెఫ్టార్మ్ సీమర్ యశ్ దయాల్ ఆస్ట్రేలియాలో ఖలీల్ స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. బంగ్లాతో సిరీస్‌లో ఎంపికైనప్పటికీ దయాల్‌కు మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు.

# తిలక్ వర్మ @3

**69 స్థానాలు ఎగబాకిన హైదరాబాదీ**

**ఆల్‌రౌండర్లలో హార్దిక్‌కు అగ్రస్థానం**

దుబాయ్: ఇటీవలే దక్షిణాఫ్రికా పర్యటనలో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో అదరగొట్టిన టీమ్ఇండియా యువ సంచలనం తిలక్ వర్మ (806) ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపాడు. తన కెరీర్‌లో తొలిసారి టాప్-10లోకి వచ్చిన ఈ హైదరాబాదీ కుర్రాడు.. ఏకంగా 69 ర్యాంక్‌లు ఎగబాకి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అతడు టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్‌వన్ బ్యాటర్ అయిన 'నయా 360' సూర్యకుమార్ యాదవ్(788)ను వెనక్కినెట్టి మూడో ర్యాంక్‌లో నిలవడం గమనార్హం. ఈ జాబితాలో ట్రావిస్ హెడ్ (855), ఫిల్ సాల్ట్(828) మాత్రమే తిలక్ కంటే ముందున్నారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# ఇక థియోటర్ల ముందు సినిమా రివ్యూలకు నో



ఇటీవల కాలంలో థియేటర్ల ముందు యూట్యూబ్ ఛానళ్లు, కొందరు నెటిజన్లు రివ్యూలు ఇవ్వడం ఎక్కువైపోయిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే ఈ హడావుడి రివ్యూలు సినిమా ఫలితంపై ప్రభావం చూపిస్తున్నాయని తమిళ్ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అభిప్రాయపడింది. ఇలాంటి రివ్యూలను కట్టడి చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది.సినిమా సమీక్ష పేరుతో వ్యక్తిగత దాడులు.. విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని ఖండిస్తూ.. సుదీర్ఘ సందేశాన్ని పోస్ట్ చేసింది. రివ్యూలు ఈ ఏడాది విడుదలైన చాలా సినిమాలపై ప్రభావం చూపించాయి. వీటిలో ప్రముఖంగా ఇండియన్ 2, వెట్టైయాన్, కంగువపై పబ్లిక్ టాక్, యూట్యూబ్ ఛానెళ్లు ఇచ్చే విశ్లేషణలు ఎంతో ప్రభావం చూపించాయి. సినీ పరిశ్రమకు తలనొప్పిగా మారుతున్న ఈ సమస్యను నివారించేందుకు అన్ని సంఘాలు కలిసి రావాలి. థియేటటర్ యజమానులు యూట్యూబ్ ఛానెళ్లను సినిమా థియేటర్ల ప్రాంగణంలోకి అనుమతించకూడదు.

# సుశాంత్ పెళ్లి కామెంట్లు.. మీనాక్షి చౌదరి రియాక్షన్



ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ లీడింగ్‌లో కొనసాగుతోంది మీనాక్షి చౌదరి. సుశాంత్ నటించిన ఇచ్చట వాహనములు నిలపరాదు సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఈ భామ ఇటీవలే లక్కీ భాస్కర్ సినిమాతో సూపర్ హిట్ కొట్టింది. ఈ భామ అక్కినేని సుశాంత్‌ను పెళ్లి చేసుకోబోతుందని ఇండస్ట్రీ సర్కిల్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై మీనాక్షి చౌదరి క్లారిటీ ఇచ్చేసింది. మెకానిక్ రాకీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా ఈ విషయమై మాట్లాడుతూ.. తాను కూడా ఈ పుకార్లను విన్నానని చెప్పింది. వెడ్డింగ్ అంటూ వస్తోన్న వార్తలను కొట్టిపారేస్తూ.. తాను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నానని స్పష్టం చేసింది. అంతేకాదు సలార్ 2లో తాను భాగస్వామ్యం అవుతున్నట్టు వస్తున్న వార్తల్లో కూడా నిజం లేదని చెప్పింది. తన పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌లో ఏదైనా ముఖ్యమైన విషయముంటే అందరితో షేర్ చేసుకుంటానంది. మీనాక్షి చౌదరి ఇటీవలే మట్కాతో ప్రేక్షకుల ముందుకు రాగా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈ భామ మరోవైపు వెంకటేశ్–అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతున్న సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

# ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ మహేశ్ బాబు




హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్స్ ప్రాజెక్టుల్లో టాప్‌లో ఉంటుంది 'ది లయన్ కింగ్'. ఈ క్రేజీ ప్రాజెక్టుకు ప్రీక్వెల్‌గా వస్తోంది 'ముఫాసా: ది లయన్ కింగ్'. ఇక ఈ మూవీ తెలుగు వర్షెన్‌లో ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ మహేశ్ బాబు వాయిస్ ఓవర్ అందించిన విషయం తెలిసిందే. ఈ మూవీ డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ రిలీజ్ కౌంట్ డౌన్ మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. మహేశ్ తాజాగా ఎక్స్‌లో 'హకునా.. మటాటా' అంటూ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. మరో నెల రోజుల్లో ఈ మూవీ రిలీజ్ కాబోతోందని.. ముఫాసాను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ రాసుకొచ్చారు. ఈ మేరకు ట్రైలర్‌ను ఈ ట్వీట్‌కు జతచేశారు. ప్రస్తుతం మహేశ్ ట్వీట్ వైరల్‌గా మారింది.

# మాలీవుడ్ మల్టీస్టారర్ కోసం మమ్ముట్టి, మోహన్‌లాల్



మాలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్టార్ ఇమేజ్ ఉన్న లీడింగ్ హీరోల్లో మమ్ముట్టి, మోహన్ లాల్ టాప్‌లో ఉంటారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ యాక్టర్ల కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుంది. సిల్వర్ స్క్రీన్‌పై అలాంటి సందడి కనిపించే టైం రాబోతుంది. మహేశ్ నారాయణన్ డైరెక్షన్‌లో రాబోతున్న ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ షూటింగ్ దశలో ఉన్న విషయం తెలిసిందే. ఈ మూవీ 150వ రోజు షూటింగ్ శ్రీలంకలో కొనసాగుతోంది. ఈ చిత్రంలో స్టార్ యాక్టర్లు ఫహద్ ఫాసిల్, కుంచకో బోబన్, నయనతార, ఆంటోజోసెఫ్, రెంజిపానికర్, షాహీన్ సిద్ధిఖీ, దర్శన్ రాజేంద్రన్, ప్రకాశ్ బెలవడి ఇతర లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. శ్రీలంకలోని గ్రీనరీలో షూటింగ్ స్పాట్‌కు సంబంధించిన స్టిల్స్‌తోపాటు మమ్ముట్టి అండ్ మోహన్ లాల్ టీం ఫొటోలు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి.

# రామ్‌పోతినేని సరసన నటిస్తున్న భాగ్య శ్రీ బోర్సే



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు డైరెక్షన్‌లో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీ పూజా కార్యక్రమాన్ని నవంబర్ 21న నిర్వహిస్తున్నట్టు ప్రకటిస్తూ మేకర్స్ విడుదల చేసిన ప్రీ లుక్‌లో సైకిల్‌ను తోసుకుంటూ వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు రామ్. 22గా వస్తోన్న ఈ మూవీకి సంబంధించి తాజాగా హీరోయిన్‌ను పరిచయం చేశారు మేకర్స్. ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. అందమైన ప్రయాణంలో భాగమవుతున్న భాగ్యశ్రీబోర్సేకు స్వాగతం పలుకుతూ మేకర్స్ విడుదల చేసిన స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్‌తో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పిన భాగ్య శ్రీ బోర్సే.. ఈ సినిమాలో అందాలు ఆరబోసినా బాక్సాఫీస్ వద్ద సినిమా ఢీలా పడిపోయింది. మరి రామ్ సినిమాతోనైనా బ్రేక్ వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు.



# చైనాలో విజయ్ సేతుపతి చిత్రం మహారాజ

కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి కాంపౌండ్ వచ్చిన చిత్రం మహారాజ. కురంగు బొమ్మై ఫేం నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో మక్కళ్ సెల్వన్ 50గా వచ్చిన ఈ చిత్రం జూన్ 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై వసూళ్ల వర్షం కురిపించింది. మహారాజ 28 రోజుల థియాట్రికల్ రన్ తర్వాత పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లోకి కూడా జులై 12న డిజిటల్ డెబ్యూ ఎంట్రీ ఇచ్చి.. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ చార్ట్స్‌లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. చాలా రోజుల తర్వాత మరోసారి వార్తల్లో నిలిచింది. మహారాజ ఇక చైనీస్ భాషలో సందడి చేయనుంది. చైనాలో భారీ స్థాయిలో విడుదలవుతూ అరుదైన ఫీట్‌ను ఖాతాలో వేసుకోబోతుందన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం మహారాజ నవంబర్ 29న చైనా వ్యాప్తంగా 40 వేలకుపైగా స్క్రీన్స్‌లలో విడుదల కానుంది. చైనా ఫిలిం ప్రొడక్షన్ కంపెనీ అలీబాబా పిక్చర్స్‌తో భాగస్వామ్యమవుతూ చైనాలో భారీ సంఖ్యలో విడుదల చేస్తున్న భారతీయ సినిమాగా మహారాజ నిలువనుంది. మరి తెలుగు సినిమాను చైనా ప్రేక్షకుల ఎలా రిసీవ్ చేసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.